TELANGANA SHASANA SABHA

TELTEL/2016/68867

తెలంగాణ
# శాసనసభ

ఎడిటర్ : పోలగోని రాజేష్

తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ శాసనసభ తెలుగు దినపత్రికకు రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తిగల, అనుభవం కలిగిన అభ్యర్థులు కావలెను..

తెలంగాణ శాసనసభ తెలుగు దినపత్రిక నెట్వర్క్ ఇంచార్జ్

పి.వెంకటేష్

9949360937,9100900931

Published from Hyderabad, Rangareddy, Nalgonda, Mahabubnagar, Khammam | సంపుటి : 2 | సంచిక : 87 | పేజీలు : 8 | శనివారం 31 ఆగస్టు 2024 | వెల : 4/-



# హైడ్రాకు స్పెషల్ పవర్స్

- ప్రకృతి వనరులను కాపాడదానికి ఏకంగా హైడ్రా అన్న వ్యవస్థ సీఎం రేవంత్ ఆలోచన
- జనం స్పందన కూడా అంతకు మించి వస్తోంది
- కంప్లైంట్స్ రోజురోజుకూ పెరుగుతుండడంతో హైడ్రా పోలీస్ స్టేషన్, త్వరలోనే చట్టం కూడా తెచ్చే ఛాన్స్
- బడాబాబులు షేక్ అయ్యేలా సీన్ మారింది
- ఎవరు అడ్డొచ్చినా వినే పరిస్థితిలో హైడ్రా బుల్డోజర్ లేదు
- నోటీసులు ఇవ్వడం పాత పద్ధతి, అక్రమమని తేలితే చాలు కూల్చడమే హైడ్రా పని.

హైదరాబాద్

అభివృద్ధి జరగాలంటే కేవలం మనిషులే బాగుపడితే సరిపోదు. చుట్టూ ఉన్న ప్రకృతిని కాపాడుకుంటూ వెళ్లాలి. దాన్ని పట్టించుకోకపోతే ప్రకృతి రిటర్న్ గిఫ్ట్ ఏదో ఒక రూపంలో కచ్చితంగా ఇచ్చి తీరుతుంది. ఇటీవలి కాలంలో రెగ్యులర్ గా చూస్తున్న కరువు, వరదలు, భూతాపమే ఇందుకు ఉదాహరణ. సహజ వనరులు బాగుండాలి. అప్పుడే అందరం బాగుంటాం అన్నది గతంలో ఏ ప్రభుత్వాలూ పెద్దగా పట్టించుకోలేదు. కానీ ఇప్పుడు ప్రకృతి వనరులను కాపాడడానికి ఏకంగా హైడ్రా అన్న వ్యవస్థ సీఎం రేవంత్ ఆలోచనల నుంచి తొలిసారిగా వచ్చింది. జనం స్పందన కూడా అంతకు మించి వస్తోంది. కంప్లైంట్స్ రోజురోజుకూ పెరుగుతుండడంతో హైడ్రా పోలీస్ స్టేషన్, త్వరలోనే చట్టం కూడా తెచ్చే ఛాన్స్ కనిపిస్తోంది. అవును హైడ్రాకు హైపవర్స్ రాబోతున్నాయి. పెద్ద లక్ష్యంతో మొదలైన - మిగతా 3లో

# మార్పు మంత్రం

- సెకండ్ కేడర్.. గులాబీ వ్యూహం
- మూడు ప్రాంతాలకు ముగ్గురు ఇన్‌చార్జులను నియమించాలని ప్లాన్
- ఒకపక్క ఎమ్మెల్యేల వలసలు.. ఇంకోవైపు నుంచి తరముకొస్తున్న స్థానిక ఎన్నికలు?
- అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో నైరాశ్యంలో కూరుకుపోయిన కార్యకర్తలు?
- అధికార పార్టీ తప్పులను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన కర్తవ్యం?
- తనను కలిసిన నేతలకు కర్తవ్య బోధ చేస్తూనే మరోవైపు నుంచి పార్టీలో అంతర్గత మార్పులు
- ఇక పార్టీలో నెంబర్ 2 లీడర్లు హరీశ్‌రావుకు ఉత్తర తెలంగాణ వ్యవహారాలను, కేటీఆర్‌కు సెంట్రల్ తెలంగాణ పార్టీ ఎఫైర్స్‌కు బాధ్యులుగా చేయాలని నిర్ణయించినట్లు సమాచారం
- మరో సీనియర్ నేత, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి దక్షిణ తెలంగాణ బాధ్యతలు

వరంగల్

ఒకపక్క ఎమ్మెల్యేల వలసలు.. ఇంకోవైపు నుంచి తరముకొస్తున్న స్థానిక ఎన్నికలు? అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో నైరాశ్యంలో కూరుకుపోయిన కార్యకర్తలు? ఆపరేషన్ ఆకర్ష్‌తో తొడగొడుతున్న కాంగ్రెస్‌ను నిలువరించాల్సిన అవసరం?. అధికార పార్టీ తప్పులను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన కర్తవ్యం? టోటల్‌గా పార్టీని పునర్నిర్మించాల్సిన పరిస్థితులు బీఆర్ఎస్‌లో కదలిక తెచ్చినట్లు కనిపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత 8 నెలలుగా పార్టీ వ్యవహారాలను పెద్దగా పట్టించుకోని అధినేత కేసీఆర్? ఒక్కసారిగా మార్పు మంత్రం జపిస్తున్నారు. తనను కలిసిన నేతలకు కర్తవ్య బోధ చేస్తూనే మరోవైపు నుంచి పార్టీలో అంతర్గత మార్పులు మొదలుపెట్టారు. పార్టీని అన్ని రకాలుగా విస్తరించడంతోపాటు ప్రజల ఆకాంక్షలకు తగ్గట్టుగా నడుచుకోవాలని నిర్ణయించి? పార్టీ నేతలకు ఒక్కొక్కరికి ఒక్కో బాధ్యత అప్పగిస్తున్నారట. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ప్రక్షాళన మొదలుపెట్టి? తన సమకాలీకుడు, రాష్ట్ర రాజకీయాల్లో అనుభవజ్ఞుడైన రావుల చంద్రశేఖర్‌రెడ్డికి - మిగతా 3లో



# ప్రైవేట్ ఏజెన్సీలకు లైసెన్స్‌లు

- ప్రైవేట్ సెక్యూరిటీ వేతనంపై డిప్యూటీ సీఎం కీలక ప్రకటన
- రాష్ట్రంలో నాలుగు లక్షల మంది ప్రైవేట్ ఏజెన్సీలు
- 1500 ఏజెన్సీలు పనిచెయ్యడం సంతోషం
- సెక్యూరిటీ ఏజెన్సీలు అనేక మందికి ఉపాధి కల్పించడం సంతోషం
- తెలంగాణ ప్రభుత్వం కూడా ఫిజికల్ సెక్యూరిటీలో పనిచేసే వారికి అండగా ఉంటుంది

హైదరాబాద్

హైదరాబాద్‌ను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో నాలుగు లక్షల మంది ప్రైవేట్ ఏజెన్సీలు ఉన్నాయన్నారు. 1500 ఏజెన్సీలు పనిచెయ్యడం సంతోషమన్నారు. సెక్యూరిటీ ఏజెన్సీలు అనేక మందికి ఉపాధి కల్పించడం సంతోషమన్నారు. - మిగతా 3లో

# రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే కుట్రలకు పాల్పడటం దుర్మార్గం

- ప్రతిపక్షంపై కక్షతో రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటున్న రేవంత్ సర్కార్
- అభివృద్ధి కాంక్షను పక్కనబెట్టి, రాజకీయ కక్షతో ముందుకు వెళ్లడం గర్హనీయం
- స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ కింద 33 జిల్లాల్లో మంజూరైన సుమారు రూ.10 వేల కోట్ల విలువ చేసే 34,511 పనులను రద్దు చేయడమే దీనికి నిదర్శనం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షంపై కక్షతో రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే కుట్రలకు పాల్పడటం దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. అభివృద్ధి కాంక్షను పక్కనబెట్టి, రాజకీయ కక్షతో ముందుకు వెళ్లడం - మిగతా 3లో






# కూటమిలో కుంపటి

- కుల గణనపై 'ఇండియా'వైపు జేడీయూ మొగ్గు
- బిహార్ మాదిరిగానే దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టి అర్హులందరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించాలని ప్రతిపక్ష కాంగ్రెస్ సహా, ఇండియా కూటమి నేతలు డిమాండ్
- కుల గణన అంశాన్ని బీజేపీ పెద్దగా ప్రస్తావించక పోవడంపై జేడీయూ గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది.
- ఎన్డీయే ప్రభుత్వంలో కీలకంగా ఉన్న జేడీయూ

# బేషరతుగా విచారం వ్యక్తం చేస్తున్నా

- న్యాయవ్యవస్థపై అత్యంత విశ్వాసం ఉంది
- విలువలను విశ్వసించే తాను న్యాయవ్యవస్థను అత్యున్నతమైనదిగా భావిస్తూనే ఉంటా
- 'నా వ్యాఖ్యలు న్యాయవ్యవస్థను ప్రశ్నిస్తున్నట్టుగా కొందరు ఆపాదించారు.
- సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసిన విషయం తెలిసిందే. దీనిపై ఎక్స్‌వేదికగా స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి



# కూటమిలో కుంపటి

**ఢిల్లీ:** దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో కుల గణన జరపాలని డిమాండ్లు వెలువెత్తుతున్న వేళ.. అధికార ఎన్డీయేలో ఈ అంశం కుంపట్లు రాజేస్తోంది. బిహార్ సీఎం నితీశ్ కుమార్‌కి చెందిన జేడీయూ ఎన్డీయే ప్రభుత్వంలో కీలకంగా ఉన్న విషయం తెలిసిందే. అయితే కుల గణన అంశాన్ని బీజేపీ పెద్దగా ప్రస్తావించక పోవడంపై జేడీయూ గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది. బిహార్ మాదిరిగానే దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టి అర్హులందరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించాలని ప్రతిపక్ష కాంగ్రెస్ సహా, ఇండియా కూటమి నేతలు డిమాండ్ చేస్తున్నారు. తాజాగా ఎన్డీయే కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న జేడీయూ సైతం ఇదే డిమాండ్‌ని తెరపైకి తెచ్చింది. ఓబీసీల సంక్షేమంపై ఏర్పాటు చేసిన పార్లమెంటు కమిటీలో జేడీయూ గురువారం చేరింది.

**వివరాలు..**

డీఎంకే సభ్యుడు టీఆర్ బాలు, బీజేపీ సభ్యుడు గణేష్ సింగ్ అధ్యక్షతన జరిగిన కమిటీ తొలి సమావేశంలో ఎజెండాలో



మొదటి అంశంగా "కుల గణన"ను చేర్చాలని కాంగ్రెస్ సభ్యుడు మాణిక్కం ఠాగూర్ ప్రతిపాదించారు. దీనిని తృణమూల్ కాంగ్రెస్ (%వీజ%) సభ్యుడు కళ్యాణ్ బెనర్జీ బలపర్చారు. ఈ ప్రతిపాదనకు జేడీయూ సభ్యుడు గిర్ధారి యాదవ్ మద్దతు ఇవ్వడం చర్చనీయాంశం అయింది. కులగణన అంశంపై కమిటీ చర్చించాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా ఆయన నొక్కి చెప్పారు. కుల గణనను నిర్వహించాలని కోరుతూ కమిటీ అధికారికంగా కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు లేఖ రాయాలని టీఎంసీ సభ్యుడు కళ్యాణ్ బెనర్జీ సిఫార్సు చేశారు. అధికార నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (%చీణూ%)లో భాగమైన %జీణ(ఖ%) దేశవ్యాప్తంగా కుల గణన చేయాలని డిమాండ్ చేస్తోంది. బిహార్‌లో గతేడాది కుల గణన నివేదికను నితీశ్ సర్కార్ విడుదల చేసింది. ఆ లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభా 13 కోట్లు. ఇందులో ఇతర వెనుకబడిన కులాల వారు(ఓబీసీలు) 27.12 శాతం, అత్యంత వెనుకబడిన వర్గాల వారు(ఈబీసీలు) 36.01 శాతం, షెడ్యూల్డ్ కులాల(%ూజ%) వారు 19.65 శాతం, షెడ్యూల్డ్ తెగలవారు(%ూు%) 1.68 శాతం ఉన్నారు. అగ్రవర్ణాల జనాభా సంఖ్య 15.52 శాతంగా ఉంది. ఓబీసీలు 27.12 శాతం, ఈబీసీలు 36.01 శాతం కలుపుకొని బీసీలు 63.13 శాతం మంది ఉన్నారు.

# కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో గవర్నర్ కీలక భేటీ.. బెంగాల్‌పై నివేదిక

**కోల్‌కతా :** కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో పశ్చిమ బెంగాల్ గవర్నర్ సి.వి.ఆనంద్ బోస్ శుక్రవారం న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కోల్‌కతాలో చోటు చేసుకున్న తాజా పరిస్థితులపై ఈ సందర్భంగా వీరిద్దరి మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తుంది. అలాగే ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రి పోస్ట్ గ్రాడ్యుయేషన్ ట్రైయినీ వైద్యురాలిపై హత్యాచార ఘటన నాటి నుంచి నిన్న మొన్నటి బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన బంద్ వరకు జరిగిన వరుస పరిణామాలపై మంత్రి అమిత్ షాకు గవర్నర్ బోస్ నివేదిక అందజేసినట్లు సమాచారం. గురువారం సాయంత్రం గవర్నర్ ఆనంద్ బోస్ న్యూఢిల్లీ చేరుకున్నారు. గత వారం ఢిల్లీ పర్యటనలో భాగంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతోపాటు ఉప రాష్ట్రపతి జగదీప్ దన్‌ఖడ్‌తో బెంగాల్ గవర్నర్ బోస్ వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బెంగాల్‌లో ట్రైయినీ వైద్యురాలి హత్యాచార ఘటనతోపాటు తదానంతరం చోటు చేసుకున్న పరిణామాలను వారికి గవర్నర్ వివరించిన సంగతి తెలిసిందే. ఆగస్ట్ 8వ తేదీ రాత్రి ఆర్ జీ కర్ మెడికల్



కాలేజీ ఆసుపత్రిలో విధులకు ట్రైయినీ వైద్యురాలి హాజరయింది. ఆ రోజు తెల్లవారుజామున అంటే ఆగస్ట్ 9 తేదీ విశ్రాంతి తీసుకునేందుకు సెమినార్ హాల్‌లోకి వెళ్లింది. ఆ రోజు ఉదయం సెమినార్ హాల్‌లో అర్ధనగ్నంగా ఆమె మృతదేహం పడి ఉండడాన్ని ఆసుపత్రి సిబ్బంది గుర్తించారు. ఈ వైద్యురాలి హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీంతో దేశవ్యాప్తంగా వైద్య సిబ్బంది ఆందోళనకు దిగారు. ఈ ఘటనలో నిందితుడు సంజయ్ రాయ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ వైద్యురాలి హత్యాచార ఘటన నేపథ్యంలో మమతా బెనర్జీ ప్రభుత్వంపై నిరసనలు అయితే వెల్లువెత్తాయి. మరోవైపు ఈ కేసు దర్యాప్తు సీబీఐకి అప్పగిస్తూ కోల్‌కతా హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఇంకోవైపు ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ.. ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఛలో సెక్రటేరియట్‌కు విద్యార్థి సంఘులు పిలుపు నిచ్చాయి. ఆ క్రమంలో ర్యాలీలోపాల్గొన్న వారిపై పోలీసులు వ్యవహరించిన వైఖరికి నిరసనగా బీజేపీ 12 గంటల పశ్చిమ బెంగాల్ బంద్‌కు పిలుపు నిచ్చింది. ఈ బంద్ సైతం హింసాత్మకంగా మారిన విషయం విధితమే. అదీకాక వైద్యురాలి మృతిపై ఆమె తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించిన పట్ల సర్వత్ర విమర్శలు సైతం వెల్లువెత్తుతున్నాయి.

# ఇండియా చేతిలో మరో బ్రహ్మాస్త్రం

**బెంగళూరు :** ప్రపంచంలో భారత్ ప్రభావవంతమైన శక్తిగా ఎదుగుతోంది. అంతర్జాతీయ వేదికలపై భారత్ అభిప్రాయానికి వేయిటేజీ కూడా పెరుగుతోంది. ఒక్క మాటలో చెప్పాలంటే.. అగ్ర దేశాలు కూడా భారత్ అంటే ఆచి తూచి అడుగేస్తున్నాయి. చివరికి, సుదీర్ఘంగా కొనసాగుతున్న యుద్ధాన్ని సైతం భారత్ ఆపగలదనే అభిప్రాయానికి వచ్చేశాయి అన్ని దేశాలు. ఇలాంటి వాతావరణం మధ్య భారత్ తన సొంత రక్షణ వ్యవహారాలపై కూడా సీరియస్‌గానే ఉంది. ఇది యుద్ధాల యుగం కాదని సూచిస్తున్నప్పటికీ.. పక్కలో బల్లెం లాంటి పాకిస్తాన్, చైనాలను తేలికగా తీసుకోలేని పరిస్థితి ఉంది. కాబట్టి, సరిహద్దుల్లో చొరబాట్లను, శత్రువులను అడ్డుకోడానికే కాక.. వివిధ ఆపరేషన్లలో దేశ విద్రోహులను కూడా అరికట్టాల్సిన అవసరం ఉంది. దీని కోసం భారత్ సైన్యానికి మరింత ఆయుధ సహకారం అవసరం ఉంది. ఇప్పటికే, భారత్ స్వయంగా తయారు చేస్తున్న రైఫిళ్లు ఉండగా.. అంతకుమించిన అవసరం ఉండగా.. తాజాగా అమెరికా నుండి 73 వేల సిగ్ సాయర్ 716 రైఫిళ్లను కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదిరింది.ఫిబ్రవరి 2019లో రూ.700 కోట్ల ఒప్పందం కింద సేకరించిన 72 వేల 400 ఎస్ఐజీ-716 అస్సాల్ట్ రైఫిల్స్‌లో 66 వేల 400 తుపాకులను భారత్ సైన్యం ఇప్పటికే అందుకుంది. అయితే, అమెరికాకు చెందిన సిగ్ సాయర్ కంపెనీ నుండి మరో 73 వేల ఎస్ఐజీ 716 రైఫిల్స్ కోసం రెన్యువల్ ఆర్డర్‌పై భారత రక్షణ మంత్రిత్వ శాఖ ఇటీవల సంతకం చేసింది. ఈ కొత్త కొనుగోలుకు సంబంధించిన డెలివరీలు 2025 చివరి నాటికి పూర్తవుతాయని తెలుస్తోంది. అయితే, ఈ ఒప్పందం 2024 జూన్‌లోనే ఖాయమయ్యింది. కాగా, కాంట్రాక్ట్ ముగిసిన 18 నెలలలోపు డెలివరీ చేయాల్సి ఉంది. భారత సైన్యాన్ని ఆధునీకరించే ప్రయత్నంలో మరిన్ని కొనుగోళ్లకు భారత్ ఆసక్తి చూపిస్తున్న తరుణంలో ఈ డీల్ చాలా ప్రత్యేకంగా నిలుస్తోంది. భారత రక్షణ మంత్రిత్వ శాఖలో ఆధునీకరణ లక్ష్యాల వల్ల ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద సైన్యంగా ఉన్న భారత్‌కు వీటిని విక్రయించడం



గర్వంగా ఉందని సిగ్ సాయర్ కంపెనీ ప్రెసిడెంట్, సీఈఓ రాన్ కోహెన్ వెల్లడించారు. 716 మోడల్ రైఫిల్స్, ఇప్పటికే పలు సంఘర్షణ ప్రాంతాల్లో తమ సామర్థ్యాన్ని నిరూపించుకున్నాయి. పాకిస్తాన్‌తో ఉన్న లైన్ ఆఫ్ కంట్రోల్ నుండి చైనాతో ఉన్న వాస్తవ నియంత్రణ రేఖ వరకు.. అలాగే, జమ్మూ కశ్మీర్‌లో తిరుగుబాటు నిరోధక కార్యకలాపాలలో కూడా ఇవి కీలకంగా పనిచేశాయి. ఇక, తాజాగా ఆర్డర్ చేస్తున్న 73 వేల అదనపు రైఫిళ్లతో భారత సైన్యంలోని మొత్తం సిగ్ సాయర్ రైఫిల్స్ సంఖ్య సుమారు లక్షా 45 వేల 400కి చేరుకుంటుంది. ఇది భారతదేశ ఫ్రంట్‌లైన్ సైనికుల ఫైర్‌పవర్‌ను గణనీయంగా పెంచుతుంది. అయితే, మరిన్ని సిగ్ సాయర్ రైఫిల్‌లను కొనుగోలు చేయాలనే నిర్ణయం కేవలం సంఖ్యకు మాత్రమే సంబంధించినది కాదు. ఇది ఎస్ఐజీ 716 ఆయుధం పనితీరు, విశ్వసనీయతకు కూడా సంబంధించినదని భారత రక్షణ దళాలు చెబుతున్నాయి.ఇక, ప్రస్తుతం వాడుకలో ఉన్న స్వదేశీ తుపాకి ఇన్సాస్ రైఫిల్స్‌ను మరో ఆధునిక రైఫిల్‌తో భర్తీ చేయాలని సైన్యం చాలా కాలంగా అనుకుంటోంది. ఇందులో భాగంగానే, ఇటీవల 66 వేల 400 ఎస్ఐజీ 716 రైఫిళ్లను సైన్యం అందుకుంది. ప్రస్తుతం, వీటిని తిరుగుబాటు నిరోధక కార్యకలాపాలలో పాల్గొన్న ఫ్రంట్‌లైన్ దళాలకు అందించారు. అలాగే, రష్యన్ ఏకే -203 రైఫిల్స్‌కు సంబంధించి బుల్ లైసెన్స్ తయారీకి అవసరమైన భారీ అవసరం ఉన్న తరుణంలో.. ఏకే-203 ఒప్పందంలో ఎక్కువ జాప్యం జరుగుతున్నందు వల్ల, సైన్యం ఎస్ఐజీ-716 రైఫిళ్లను తిరిగి కొనుగోలు చేయాలని నిర్ణయించుకుంది. ఎస్ఐజీ 716 రైఫిల్స్ కొంత మేరకు ఉండటం సైన్యానికి బలం చేకూరస్తుందనే ఆలోచనలో భారత్ ఈ నిర్ణయం తీసుకుంది.సిగ్ 716 రైఫిల్స్ ప్రపంచవ్యాప్తంగా అనేక ఇతర సైనిక దళాలు కూడా ఉపయోగిస్తున్నాయి. యూఎస్ మిలిటరీ, స్పెషల్ ఆపరేషన్స్ ఫోర్సెస్‌తో సహా చాలా దేశాలు వాడుతున్న ఈ సిగ్ సాయర్ రైఫిల్ వాటి ఖచ్చితత్వం, నాణ్యత, విశ్వసనీయతను తెలియజేస్తున్నాయి. పోర్చుగల్, థాయ్‌లాండ్, వియత్నాం వంటి దేశాల్లోని భద్రతా దళాలు కూడా సిగ్ సాయర్ రైఫిల్స్‌ను ఇష్టపడుతున్నాయి. ఇలాంటి రైఫిల్ కంపెనీతో భారత్ చేసుకున్న ఈ భాగస్వామ్యం.. సిగ్ సాయర్ బ్రాండ్‌పై ప్రపంచ నమ్మకాన్ని నొక్కి చెప్పడంతో పాటు భారత సైన్యం అంతర్జాతీయ సైనిక ప్రమాణాలను కలిగిఉండటాన్ని హైలైట్ చేస్తుంది. ఇక, భారత్ అమెరికాతో తన రక్షణ సంబంధాలను బలోపేతం చేయడం కొనసాగిస్తున్న తరుణంలో.. ఈ అదనపు రైఫిల్స్ కొనుగోలు కేవలం వ్యూహాత్మక నిర్ణయంగా మాత్రమే కాకుండా.. ప్రపంచ వేదికపై భారత్ కీలక ప్లేయర్‌గా తన స్థానాన్ని బలోపేతం చేసే వ్యూహాత్మక చర్యగా తెలుస్తోంది.ఇటీవల అమెరికా పర్యటన నుండి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తిరిగి వచ్చిన తర్వాత ప్రకటించిన ఈ కొనుగోలు అంశం కీలకమైన సమయంలో జరిగింది. భారత ప్రధాని నరేంద్ర మోడీ సెప్టెంబర్‌లో అమెరికాను సందర్శించనున్న తరుణంలో.. ఎస్ఐజీ-716 రైఫిల్స్ కొనుగోలు నిర్ణయం భారత్, అమెరికా మధ్య పెరుగుతున్న వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలపరుస్తున్నాయని రుజువు చేస్తోంది. ఇరు దేశాల మధ్య రక్షణ భాగస్వామ్యం.. భవిష్యత్ సహకారాలకు మార్గం సుగమం చేస్తుంది. అలాగే, భారత్ చుట్టూ పెరుగుతున్న భద్రతా సవాళ్ల నేపథ్యంలో భారతదేశం సైనిక పరంగా పూర్తిగా సంసిద్ధతతో ఉండటాన్ని సూచిస్తోంది. అయితే, అమెరికా నుండి కొంటున్న ఎస్ఐజీ -716 రైఫిల్స్? గతంలో రష్యా నుండి కొనుగోలు చేసిన ఏకే-203తో సరితూగుతాయా అన్నది మాత్రమే ఇప్పుడు కొంత చర్చకు దారితీసింది.

## వైద్యురాలి తల్లిదండ్రులకు అర గంటలో మూడు ఫోన్ కాల్స్




**కోల్‌కతా, ఆగస్ట్ 30:** పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ట్రైయినీ వైద్యురాలి హత్యాచారం కేసు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటన జరిగి 21 రోజులయింది. ఆమె మృతిపై దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఇంకా ఆందోళనలు కొనసాగుతున్నాయి. ట్రైయినీ వైద్యురాలి మృతికి సంబంధించి పలు భయంకరమైన వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. తమ కుమార్తె మృతిపై ఆసుపత్రి సిబ్బంది వ్యవహరించిన తీరు పట్ల మృతిరాలి తల్లిదండ్రులు పలు సందేహాలు వ్యక్తం చేశారు. ఆగస్ట్ 9వ తేదీ ఉదయం కేవలం అరగంట వ్యవధిలో ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రి నుంచి తమకు మూడు ఫోన్ కాల్స్ వచ్చాయని తెలిపారు. మొదటి ఫోన్ కాల్‌లో తమ కుమార్తె ఆరోగ్య పరిస్థితి బాగోలేదని.. వెంటనే ఆసుపత్రికి రావాలని చెప్పారన్నారు. తమ కుమార్తెకు ఏమైందంటూ ఆందోళనగా ఫోన్‌లో కోరగా.. తాను వైద్యురాలిని కాదని.. అసిస్టెంట్ సూపరింటెండెంటంటూ అవతలి వ్యక్తి స్పష్టం చేశారన్నారు. ఆ వెంటనే మరో ఫోన్ కాల్ వచ్చిందని.. తమ కుమార్తె అరోగ్యం ఎలా ఉందని ప్రశ్నించే లోపే.. ముందు ఆసుపత్రిలోని ఛాతీ విభాగానికి రావాలని ఫోన్ చేసిన వారు సూచించారన్నారు. ఆ కొద్ది సేపటికే మరో ఫోన్ కాల్ వచ్చిందని.. తమ కుమార్తె మరణించిందన్నారు. అదీ కూడా ఆమె ఆత్మహత్య చేసుకుని మృతి చెందిందని చెప్పారంటూ తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ఘటన జరిగే ముందు రోజు అంటే ఆగస్ట్ 8వ తేదీ రాత్రి 11.30 గంటలకు తమ కుమార్తెతో తాను మాట్లాడానని ఈ సందర్భంగా ఆమె తల్లి గుర్తు చేసుకున్నారు. ఆ మరునాడే తన కుమార్తె మరణ వార్త వినాల్సి వచ్చిందన్నారు. వైద్యురాలిపై హత్యాచారం అనంతరం తమ పట్ల ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ సిబ్బంది వ్యవహరించిన తీరుపై తల్లిదండ్రులు కోర్టును ఆశ్రయించారు. తమ కుమార్తె మృతి చెందిన వెంటనే తమకు సమాచారం ఇవ్వలేదన్నారు. అలాగే తమ కుమార్తె మృతదేహాన్ని వెంటనే తాము చూసే అవకాశం కూడా కల్పించలేదన్నారు. అందుకోసం దాదాపు 3 గంటలపాటు ఆసుపత్రిలో తమను వేచి ఉంచారని పేర్కొన్నారు. ఈ అంశంపై ఇప్పటికే కోర్టులో విచారణ జరిగింది. అందుకు కారణాలు ఏమిటని ఆసుపత్రి ఉన్నతాధికారులను ప్రశ్నించింది. ఇప్పటికే స్థానిక కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు ఈ కేసుపై స్పందించాయి. ఈ సందర్భంగా మమతా బెనర్జీ ప్రభుత్వానికి ప్రశ్నలు సంధించాయి. అలాగే ఈ వ్యవహారంపై మమతా బెనర్జీ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఛలో సెక్రటేరియట్‌కు పశ్చిమ బెంగా ఛత్ర సమాజ్ సభ్యులు మంగళవారం పిలుపునిచ్చారు. ఆ క్రమంలో వందలాది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనకు నిరసనగా బుధవారం బీజేపీ బంగాల్ బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ బంద్ సైతం హింసాత్మకంగా మారిన సంగతి తెలిసిందే. ఇక వైద్యురాలి హత్యాచారం కేసు దర్యాప్తు సీబీఐ చేపట్టిన విషయం విధితమే.

## సామాన్యులకు శుభవార్త..

## సెప్టెంబర్ 1 నుంచి తగ్గనున్న గ్యాస్ సిలిండర్ ధర..!



వచ్చే నెల 1న ప్రభుత్వం సామాన్యులకు శుభవార్త చెప్పబోతోంది. గ్యాస్ సిలిండర్ ధరలతోపాటు పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. సెప్టెంబర్ 1 నుంచి ఇంటి అవసరాలకు వినియోగించే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధర రూ.50.. వాణిజ్య సిలిండర్ల ధర రూ.60 నుంచి రూ.70 వరకు తగ్గుతుందని నేషనల్ మీడియా కథనాలు స్పష్టం చేస్తున్నాయి. ఆగస్టులో బిజినెస్-గ్రేడ్ ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల ధర రూ.8.50 పెరిగింది, జూలైలో రూ.30 తగ్గింది. గతేడాది రాఖీ, ఈ ఏడాది మహిళా దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం డొమెస్టిక్ ఎల్‌పీజీ సిలిండర్ ధరను రూ.300 తగ్గించింది. ఇప్పుడు దాని ధర మరో రూ.50 తగ్గితే.. రూ.760కే అందుబాటులోకి వస్తుంది. పీఎం ఉజ్వల యోజ కింద రాయితీ పొందేవారు రూ.460కే సిలిండర్‌ని ఇంటికి తీసుకెళ్లవచ్చు. గ్యాస్ సిలిండర్ రేట్లతోపాటు పెట్రోల్, డీజిల్ ధరలు కూడా తగ్గనున్నట్లు సమాచారం. పెట్రోల్ లీటర్‌పై రూ.6, డీజిల్ లీటర్‌పై రూ.5 వరకు తగ్గనున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం దేశంలో పెట్రోల్ ధర లీటర్ రూ.100 దాటగా.. డీజిల్ ధర రూ.90 దాటింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు రేట్లు తక్కువగా ఉండటంవల్లే కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

# కంగన చేతిలో ఓడిపోయిన అభ్యర్థికి.. రాహుల్ కంటే ఎక్కువ ప్రియారిటీ ఇచ్చిన కాంగ్రెస్..!

ఇటీవలే జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రెండు స్థానాల్లో ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ, కేరళలోని వయనాడ్ నుంచి పోటీ చేసి రెండు చోట్లా గెలుపొందారు. అయితే, ఈ ఎన్నికల్లో రాహుల్ కంటే.. బీజేపీ అభ్యర్థి చేతిలో ఓడిపోయిన విక్రమాదిత్య సింగ్‌కే కాంగ్రెస్ పార్టీ ఎక్కువ ప్రియారిటీ ఇచ్చింది. ఎన్నికల ఫండ్ విషయంలో రాహుల్ కంటే విక్రమాదిత్యకే ఎక్కువ మొత్తం ఇచ్చింది. లోక్‌సభ ఎన్నికల కోసం తమ అభ్యర్థులకు ఫండ్ కింద ఎంత మొత్తం అందించామన్న విషయాన్ని కాంగ్రెస్ పార్టీ కేంద్ర ఎన్నికల సంఘానికి తెలియజేసింది. ఈ క్రమంలో రాహుల్‌కు రూ.1.40 కోట్లను ఇచ్చినట్లు తెలిపింది. ఒక్కోస్థానానికి రూ.70 లక్షలు చొప్పున రెండు స్థానాలకు కలిపి ఈ మొత్తాన్ని అందించినట్లు వెల్లడించింది. అయితే, పార్టీలోనే హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం మండి లోక్‌సభ స్థానం (%మీఖఅఎఆ ఒమ్ఫ్%) నుంచి పోటీ చేసిన విక్రమాదిత్య సింగ్ (%ఎఆఎనెత్తుఖుఎత్ఖు ాఆఅస్త్రష్ట%)కు అత్యధిక ఫండ్ అందించినట్లు తెలిపింది. ఏకంగా రూ.87 లక్షలు ఇచ్చినట్లు పేర్కొంది. అయితే, ఆ స్థానం నుంచి విక్రమాదిత్య సింగ్ ఓడిపోయిన విషయం తెలిసిందే. మండి నుంచి బాలీవుడ్ స్టార్ నటి, బీజేపీ నాయకురాలు కంగన రనౌత్ చేతిలో ఓటమి చవిచూశారు. అదేవిధంగా అమేథిలో బీజేపీ సిట్టింగ్ ఎంపీ స్మృతి ఇరానీని ఓడించిన కిషోరీలాల్ శర్మకు, కేరళ అలప్పుజ నుంచి పోటీ చేసిన కేసీ వేణుగోపాల్, మాణికం ఠాగోర్ (విరుధునగర్, తమిళనాడు), కర్ణాటకలోని గుల్బర్గా నుంచి బరిలోకి దిగిన రాధాకృష్ణ, పంజాబ్‌లోని ఆనంద్‌పూర్ సాహిబ్ నుంచి పోటీ చేసిన విజయ్ ఇందర్ సింగ్లాకు ఒక్కొక్కరికి రూ.70లక్షలు అందించినట్లు హస్తం పార్టీ తెలిపింది. ఇక ఈ ఎన్నికల్లో ఫండ్ కింద కాంగ్రెస్




సీనియర్ నేతలు ఆనంద శర్మకు రూ.46 లక్షలు, దిగ్విజయ్ సింగ్ రూ. 50 లక్షలు అందుకున్నారు. అయితే, ఇద్దరు నేతలూ ఎన్నికల్లో ఓటమి చవిచూశారు. మరోవైపు రెండు స్థానాల్లో గెలుపొందిన రాహుల్.. రాయ్‌బరేలీ స్థానాన్ని అట్టే పెట్టుకున్నారు. వయనాడ్ స్థానానికి రాజీనామా చేశారు. అక్కడ ప్రియాంక గాంధీ పోటీ చేయనున్నట్లు తెలిసింది.

# హైడ్రాకు స్పెషల్ పవర్స్

-మొదటిపేజీ తరువాయి

ఈ వ్యవస్థకు ఇప్పుడు బలం విపరీతంగా పెరిగింది. జనం నుంచి అనూహ్యమైన స్పందన వచ్చింది. బడాబాబులు షేక్ అయ్యేలా సీన్ మారింది. ఎవరు అడ్డొచ్చినా వినే పరిస్థితిలో హైడ్రా బుల్డోజర్ లేదు. నోటీసులు ఇవ్వడం పాత పద్ధతి, అక్రమమని తేలితే చాలు కూల్చడమే హైడ్రా పని. అవును ఇలాంటి వ్యవస్థ ఇదే తొలిసారి. పార్టీలకు అతీతంగా పవర్ చూపిస్తోంది. సాధారణంగా అధికారంలో ఉన్న వారైతే ఒకలా ట్రీట్ మెంట్, ప్రత్యర్థి పార్టీలైతే మరోలా ట్రీట్ మెంట్ ఉంటుంది. దీంతో ఒకర్ని వదిలేసి ఇంకొకరిపై చర్యలు తీసుకుంటే అసలు లక్ష్యమే నీరుగారిపోతుంది. గతంలో ఇలా పర్యావరణ పరిక్షణ కోసం, జల వనరుల సంరక్షణ కోసం వ్యవస్థలు ఏర్పాటైనా ఆశించిన లక్ష్యం నెరవేరలేదు. సో ఇప్పుడు కథ మార్చాలని డిసైడ్ అయ్యారు సీఎం రేవంత్ రెడ్డి. అన్నిటి మాదిరిగానే హైడ్రాను పెడితే ఎలాంటి ఉపయోగం లేదని ముందుగానే డిసైడ్ అయ్యారు. అందుకే కాస్త కఠినంగా ఉండైనా సరే అనుకున్న లక్ష్యం దిశగా హైడ్రాను నడిపిస్తున్నారు. మిత్రులైనా, ప్రత్యర్థి పార్టీల నేతలైనా ఒకటే ట్రీట్ మెంట్ ఉంటోంది.కాబట్టి ఇప్పుడు హైడ్రాకు పని చాలా పెరిగింది. మొదట్లో ఒకట్రెండు ఫిర్యాదుల నుంచి ఆ తర్వాత పదుల సంఖ్యలోకి పెరిగాయి. సీన్ కట్ చేస్తే ఇప్పుడు వందలాది కంప్లైంట్స్ వస్తున్నాయి. వాటిలో ప్రాధాన్యతా క్రమంలో హైడ్రా డీల్ చేస్తోంది. చెరువును చెరపట్టిన వారి భరతం పడుతోంది. హైడ్రా బుల్డోజర్ సిటీలో ఏ మూలకైనా వెళ్లేలా ఈ సంస్థకు ఇకపై సరికొత్త పవర్స్ రాబోతున్నాయి. అనుకుంటే ఏదైనా చేసేలా అధికారాలు రాబోతున్నాయి. ఇప్పటిదాకా ఎఫ్టీఎల్ పరిధిలోని నిర్మాణాలను కూలుస్తూ ఆక్రమణదారులకు దడ పుట్టిస్తున్న హైడ్రా.. ఇలాంటి వాటికి పర్మిషన్లు ఇచ్చిన అధికారులైనా నజర్ పెట్టింది. అంతర్గతంగా విజిలెన్స్ విచారణ కూడా కొనసాగుతోంది. సో కథ చాలా దూరం వెళ్లేలా కనిపిస్తోంది.ప్రస్తుతం బుద్ధభవన్‌లోని ఆఫీసులో హైడ్రా కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. చెరువుల ఆక్రమణలపై పెద్దసంఖ్యలో వస్తున్న ఫిర్యాదులను పరిశీలించేందుకు ఇప్పటికే ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించిన హైడ్రా, ఆ పోలీస్ స్టేషన్‌ను బుద్ధభవన్‌లోనే ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. ఇప్పటికే డిప్యుటేషన్‌పై 259 మంది పోలీసు సిబ్బందిని కోరగా, ఆ సంఖ్య మరింతగా పెరుగుతుందంటున్నారు. మరోవైపు ఇప్పటివరకు కూల్చివేతలకు సంబంధించి ఆక్రమణదారులపై



ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో హైడ్రా కేసులు నమోదు చేసేందుకు రెడీ అయింది. అలాగే అక్రమ నిర్మాణాలకు సంబంధించి అనుమతులు ఇచ్చిన అధికారులపైనా అంతర్గతంగా విజిలెన్స్ విచారణ కొనసాగిస్తోంది. హైడ్రా ఆఫీసుకు అన్ని పార్టీల నుంచి తాకిడి రోజురోజుకు పెరుగుతోంది.మొదట పదుల సంఖ్యలో వచ్చిన కంప్లైంట్స్ కాస్తా హైడ్రా కఠిన చర్యలతో వందల్లోకి పెరుగుతున్నాయి. వాటన్నింటిని స్వీకరిస్తున్న సిబ్బంది, ఆ వివరాలను నమోదు చేసుకుంటూ కమిషనర్ రంగనాథ్ దృష్టికి తీసుకెళ్తున్నారు. అందులో వేగంగా చర్యలు తీసుకోవాల్సిన వాటిపై రంగనాథ్ ఫోకస్ పెడుతున్నారు. అన్ని కోణాల్లో పరిశీలించాకే రంగంలోకి దిగుతున్నారు. మరోవైపు కంప్లైంట్స్ ఇచ్చే వారి సంఖ్య పెరగడంతో హైడ్రా ఆఫీస్ దగ్గర పోలీసుల బందోబస్తు పెంచారు. సో జనం నుంచి ఊహించనంతగా రెస్పాన్స్ వస్తుండడంతో హైడ్రా బుల్డోజర్ స్పీడ్ పెంచేందుకు సిద్ధమవుతున్నారు. త్వరలోనే హైడ్రా చట్టం కూడా తెచ్చేలా రెడీ అవుతోంది ప్రభుత్వం. హైడ్రా పోలీస్ స్టేషన్స్ ఏర్పాటు చేశాక.. ప్రజలు నేరుగా అక్కడికే వెళ్లి అక్రమ నిర్మాణాలపై కంప్లైంట్స్ ఇచ్చేలా ఏర్పాటు చేయబోతున్నారు.నిజానికి చెరువుల ఎఫ్టీఎల్ పరిధిలో ఎలాంటి నిర్మాణాలు ఉండకూడదు. కానీ జరిగిపోయాయి. ఎందుకంటే అక్రమంగా పర్మిషన్లు ఇవ్వడం, తప్పుడు సర్వే నెంబర్లు చూపి పర్మిషన్ల కోసం అప్లై చేసుకున్న వారి వ్యవహారాలను క్షేత్రస్థాయిలో పరిశీలించకపోవడం ఇవన్నీ జరిగాయి. ఇంకొందరు పైసల కక్కుర్తితో రాజీ పడి పర్మిషన్లు ఇచ్చేశారు.

అయితే ఇన్ని రోజులుగా అక్రమ నిర్మాణాలను బుల్డోజర్ తో నేలమట్టం చేస్తున్న హైడ్రా.. ఇకపై అక్రమ పర్మిషన్లు ఇచ్చిన ఆఫీసర్లపైనా లెన్స్ పెట్టింది. అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై హైడ్రా పోలీస్ స్టేషన్ చర్యలు తీసుకుంటుందంటున్నారు రంగనాథ్. ఇప్పటివరకు జరిగిన విచారణలో కొంతమంది అవినీతి అధికారులను హైడ్రా గుర్తించింది కూడా. అవినీతి అధికారులపై త్వరలోనే కేసు నమోదు చేసి విచారణ చేస్తామనీ అంటున్నారు. సో పర్మిషన్లు ఇచ్చేశాం.. మాకేం సంబంధం లేదు అనే వారికి చుక్కలు చూపించబోతున్నారు. చెప్పాలంటే భవిష్యత్ లో ఇలాంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకుండా శాశ్వత పరిష్కారం చూపబోతున్నారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసి ప్లాట్స్ చేసి అమ్మిన వారిపైనా చర్యలకు యాక్షన్ ప్లాన్ రెడీ అవుతోంది.ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో బయట ఉన్న చెరువులను కాపాడడమే లక్ష్యంగా హైడ్రా స్పీడ్ పెంచుతోంది. ప్రస్తుతం కొందరి విద్యాసంస్థలు చెరువుల ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో ఉన్న విషయం హైడ్రా దృష్టికి వచ్చింది. ఒవైసీ, మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డికి సంబంధించిన విద్యాసంస్థల వ్యవహారంపై హైడ్రాకు ఇప్పటికే కంప్లైంట్స్ వచ్చాయి. ఇలా చెరువుల పరిధిలో పదుల సంఖ్యలో కాలేజీలు ఉన్నాయి. అయితే ఇక్కడ విద్యాసంస్థ ఎవరిదన్నది కాదు.. విద్యార్థుల భవిష్యత్ కూడా ఆలోచించి నిర్ణయం తీసుకునేందుకు హైడ్రా నిర్ణయం తీసుకోబోతోంది. ఎఫ్టీఎల్ పరిధిలోని ఫాతిమా, మల్లారెడ్డి వంటి కాలేజీలకు సమయం ఇస్తామని రంగనాథ్ అంటున్నారు. వచ్చే విద్యాసంవత్సరంలోపు సీన్ మారిపోవాలంటున్నారు. అంతేకాదు పార్టీలకు అతీతంగా తమ చర్యలు ఉంటాయని, ధర్మ సత్రమైనా ఎఫ్‌టీఎల్‌లో ఉంటే కూల్చేస్తామంటున్నారు. హైడ్రా నోటీసులు ఇవ్వదు, కూల్చడమే అన్న పాయింట్ చుట్టూ కథ నడుస్తోంది.ఇకపై చెరువుల పరిధిలో అక్రమ పర్మిషన్లు ఇవ్వాలన్నా భయపడేలా హైడ్రా చర్యలు ఉండబోతున్నాయి. అలాంటి వాటి జోలికి వెళ్లకుండా చేసేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయనున్నారు. అవసరమైతే క్షేత్రస్థాయిలోకి వెళ్లి ఫోటోలు, వీడియోలు తీశాకే, సర్వే నెంబర్ నిర్ధారించుకున్న తర్వాతే నిర్మాణాలు అనుమతులు ఇచ్చేలా వ్యవస్థ మార్చబోతున్నారు. తప్పుడు సర్వేనెంబర్లు ఇచ్చినా, వాటిని క్రాస్ చెక్ చేసుకోకుండా అనుమతులు ఇచ్చే వారిపైనా ఇకపై కేసులు, కఠిన చర్యలు ఉండబోతున్నాయి. పర్యావరణ హితమే లక్ష్యంగా హైడ్రా యాక్షన్ ప్లాన్ మరింతగా పెరిగే అవకాశం ఉంది.

## రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే కుట్రలకు పాల్పడటం దుర్మార్గం



-మొదటిపేజీ తరువాయి

గర్హనీయమని విమర్శించారు. రేవంత్ రెడ్డి దివాళాకోరు రాజకీయాలకు ఇది పరాకాష్ట అని ఆగ్రహం వ్యక్తంచేశారు. స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ కింద 33 జిల్లాల్లో మంజూరైన సుమారు రూ.10 వేల కోట్ల విలువ చేసే 34,511 పనులను రద్దు చేయడమే దీనికి నిదర్శనమన్నారు. గత అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ పార్టీ అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం ఈ వివరాలను బయటపెట్టిందంటూ ఎక్స్ వేదికగా వెల్లడించారు. 'రాష్ట్ర ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా మంజూరైన అనేక పనులను నిలిపివేయడంతో పాటు, ఇప్పటికే ప్రారంభమైన అనేక పనులను తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు కొనసాగించొద్దని మధ్యంతరంగా నిలిపివేస్తూ ఆదేశాలు ఇచ్చింది. దాదాపు పూర్తి కావొస్తున్న ప్రాజెక్టులకు సైతం బిల్లుల చెల్లింపులు నిలిపివేసింది. దీంతో రాష్ట్రంలోని దాదాపు ప్రతి గ్రామంలో పంచాయతీరాజ్, మున్సిపల్, రోడ్లు-భవనాలు, నీటిపారుదల తదితర శాఖలపరిధిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయాయి. ఫలితంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన ప్రక్రియకు ఆటంకం కలిగింది. దీంతో ఎంతో మంది ఉపాధి కూడా కోల్పోతున్నారు. 9 నెలల కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి నిరోధక అజెండాతో రాష్ట్రాన్ని అధోగతిపాలు చేస్తున్నది. ఈ ప్రభుత్వానికి కొత్త పనులను చేపట్టే శక్తిసామర్థ్యాలు లేవని ఇప్పటికే తేలిపోగా, మంజూరైన పనులను పూర్తి చేసే కనీస నైతిక బాధ్యత కూడా లేదని పనుల రద్దుతో స్పష్టమైంది. కాంగ్రెస్ పాలన ప్రజలకు శాపంగా మారింది. అభివృద్ధి నిరోధకులుగా ముఖ్యమంత్రి వ్యవరిస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం గత ఆర్థిక సంవత్సరంలో నియోజకవర్గాలకు కేటాయించిన ఎస్డీఎఫ్ నిధులను ఈ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రద్దు చేసింది. అయితే ఈ నిధుల నుండే మార్చి నెలలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాలకు 10 కోట్ల చొప్పున మంజూరు చేసింది. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలకు మాత్రమే నిధులు ఇచ్చి తన కురచ బుద్ధిని, పక్షపాత ధోరణిని చూపింది. కాంగ్రెస్ పార్టీ గెలవని నియోజకవర్గాలపై కక్షతో ఒక్క రూపాయి నిధులను కూడా కేటాయించకపోవడం దుర్మార్గం. నిధులు కేటాయించకపోగా పురోగతిలో ఉన్న పపనులకు సైతం నిధులు నిలిపివేయడం మరో దుర్మార్గం. ఇప్పటివరకు రద్దు చేసిన ఎస్డీఎఫ్ పనులకు సంబంధించి ముఖ్యమంత్రి రాష్ట్రస్థాయిలో ఒక సమీక్ష సమావేశం కూడా నిర్వహించలేదు. జిల్లా కలెక్టర్లు, అధికారులు సైతం రద్దు చేసిన పనులకు సంబంధించి ఎలాంటి సమీక్షా జరపలేదు. కనీసం పురోగతిలో ఉన్న పనుల నివేదికను ప్రభుత్వానికి ఇవ్వడంలో విఫలమయ్యారు. ప్రభుత్వం అనేది నిరంతర ప్రక్రియ. ఈ ప్రక్రియలో ప్రజల అవసరాలు మారవు. మారేది కేవలం ప్రభుత్వాలు మాత్రమే. గత ప్రభుత్వ ఆనవాలు లేకుండా చేస్తానని కంకణం కట్టుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి తన అనాలోచిత చర్యలతో తన ఆనవాలునే ప్రజల్లో లేకుండా చేసుకుంటున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్వార్థ పూరిత రాజకీయాలు చేయడం పక్కనపెట్టి, రాష్ట్ర అభివృద్ధికి పాటు పడాలి. గత ప్రభుత్వం మంజూరు చేసినప్పటికీ అవి ప్రజల అవసరాల కోసమే కాబట్టి ఆ పనులను పూర్తి చేసేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని, నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం.' అంటూ హరీశ్‌రావు ట్వీట్ చేశారు.

## మార్పు మంత్రం...

-మొదటిపేజీ తరువాయి

కార్యాలయ కార్యదర్శిగా కీలక బాధ్యతలు అప్పగించినట్లు చెబుతున్నారు. ఇక పార్టీలో నెంబర్ 2 లీడర్లు హరీశ్‌రావుకు ఉత్తర తెలంగాణ వ్యవహారాలను, కేటీఆర్‌కు సెంట్రల్ తెలంగాణ పార్టీ ఎఫైర్స్‌కు బాధ్యులుగా చేయాలని నిర్ణయించినట్లు చెబుతున్నారు. మరో సీనియర్ నేత, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి దక్షిణ తెలంగాణ బాధ్యతలు అప్పగించి.. మూడు ప్రాంతాలకు ముగ్గురు ఇన్‌చార్జులను నియమించాలని ప్లాన్ చేస్తున్నారు కేసీఆర్. దీనివల్ల ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి సమాచారం పార్టీ హైకమాండ్‌కు తెలియడంతోపాటు క్యాడర్ టు లీడర్ రిలేషన్ డెవలప్ చేయాలని వ్యూహం రెడీ చేస్తున్నట్లు తెలుస్తోంది.రాష్ట్ర ఆవిర్భావానికి ముందు ఉద్యమ పార్టీగా వ్యవహరించిన బీఆర్ఎస్? పదేళ్ల అధికారంలో ఉండగా పార్టీలో వ్యవస్థాగత నిర్మాణంపై పెద్దగా ఫోకస్ చేయలేదనే అభిప్రాయం ఉంది. దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత జిల్లాల్లో ఓటమికి ఎవరిని బాధ్యులను చేయాలో? ఎవరిని నిందించాలో తెలియని అయోమయ పరిస్థితి ఎదుర్కొంది. పార్టీలో లోటుపాట్లను తెలుసుకునే యంత్రాంగం లేకపోవడం, ఎక్కువగా పోలీస్ ఇంటిలిజెన్స్‌పై ఆధారపడటం వల్ల?. పార్టీలో ఏం జరుగుతుందనే సమాచారం కచ్చితంగా తెలియలేదని అంటున్నారు. ఇదే ఓటమికి ప్రధాన కారణంగా గుర్తించారు కేసీఆర్‌ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పోలీస్ ఇంటెలిజెన్స్‌ను నమ్మాల్సి రావడం.. కార్యకర్తలు ఏం కోరుకుంటున్నారో తెలుసుకోలేకపోవడం వల్లే వ్యతిరేకత ఎదుర్కొన్న వారికి మళ్లీ టికెట్లు ఇవ్వాల్సి వచ్చిందంటున్నారు. దీని వల్ల ఎంత నష్టం జరిగిందో ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్న కేసీఆర్.. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీని పునర్నిర్మించాలని భావిస్తున్నట్లు చెబుతున్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఇలాంటి వ్యవస్థను ఏర్పాటు చేయకపోవడం, ఉన్నా వాటిని పెద్దగా పట్టించుకోకపోవడం వల్ల ఎన్నికల్లో దెబ్బతిన్నామని? ఈ తప్పు మళ్లీ రిపీట్ కాకుండా ఉండాలంటే పార్టీ పునర్నిర్మాణమే ఏకైక మార్గంగా భావిస్తున్న కేసీఆర్? ఇతర రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీల పనితీరుపై అధ్యయనానికి ఓ కమిటీని నియమించినట్లు చెబుతున్నారు.పార్టీలో నిర్మాణ లోపాలను అధిగమించాలని భావించిన కేసీఆర్? దేశంలో బలమైన ప్రాంతీయ పార్టీలుగా గుర్తింపు తెచ్చుకున్న డీఎంకే, ఏఐఏడీఎంకే, తృణమూల్ కాంగ్రెస్, బీజేడీ పార్టీల పనితీరు, వ్యవస్థాగత నిర్మాణాలను అధ్యయనం చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందుకోసం మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆధ్వర్యంలో పార్టీ ప్రతినిధుల బృందాన్ని ఇటీవల చెన్నై పంపినట్లు సమాచారం. ఇదే క్రమంలో వచ్చే నెలలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా ఇతర రాష్ట్రాల్లో పర్యటించనున్నట్లు చెబుతున్నారు. పార్టీ అధికారంలో ఉన్నా?. ప్రతిపక్షంలో ఉన్నా కార్యకర్తలను చెక్కుచెదరకుండా చూసుకోవడమే ఈ అధ్యయనం తాలుకా మొయిన్ కాన్సెప్ట్ అంటున్నారు. దాదాపు 60 లక్షల కార్యకర్తల సభ్యత్వం గులాబీ పార్టీ బలం. వీరందరికీ జిల్లా, రాష్ట్ర స్థాయిలో శిక్షణ ఇవ్వడం ద్వారా సుశిక్షితులైన సైనికులుగా తీర్చిదిద్ది ప్రభుత్వ ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని భావిస్తున్నారు కేసీఆర్.అధినాయకత్వంపై కార్యకర్తల్లో నమ్మకం ఉన్నా, ద్వితీయ శ్రేణి నాయకత్వంలో నిలకడలేని విషయాన్ని గమనించిన గులాబీ బాస్ కేసీఆర్?. అలాంటి వారే పార్టీ వదిలివెళ్లిపోతున్నట్లు గుర్తించారు. ఈ కారణంగానే ఇకపై సెకండ్ క్యాడర్‌ను సొంతంగా తయారు చేసుకోవాలని నిర్ణయించారు. ఉద్యమ సమయంలో చురుగ్గా వ్యవహరించిన విద్యార్థి నాయకులను ఎమ్మెల్యేలుగా చేస్తే? ఇప్పుడు వారంతా పార్టీకి వెన్నుదన్నుగా నిలిచారని.. ఈ క్రమంలోనే ఇకపై పార్టీ కార్యకర్తల్లో చురుగ్గా ఉన్నవారిని గుర్తించి ప్రోత్సహించాలని నిర్ణయించినట్లు సమాచారం. అందుకే రాష్ట్రంలో ఒక్కో ప్రాంతానికి ఒక్కో ఇన్‌చార్జిని నియమించి చురుకైన వారిని గుర్తించడం, పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతంపై దృష్టి పెట్టినట్లు చెబుతున్నారు.

# బేషరతుగా విచారం వ్యక్తంచేస్తున్నా

**హైదరాబాద్:** భారత న్యాయవ్యవస్థపై తనకు అత్యంత విశ్వాసం ఉన్నదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాజ్యాంగం, దాని విలువలను విశ్వసించే తాను న్యాయవ్యవస్థను అత్యున్నతమైనదిగా భావిస్తూనే ఉంటానని చెప్పారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు మంజూరైన బెయిల్‌కు సంబంధించి సీఎం చేసిన అడ్డగోలు వ్యాఖ్యలను సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసిన విషయం తెలిసిందే. దీనిపై ఎక్స్‌వేదికగా స్పందించిన సీఎం రేవంత్.. 'నా వ్యాఖ్యలు న్యాయవ్యవస్థను ప్రశ్నిస్తున్నట్టుగా కొందరు ఆపాదించారు. ప్రత్రికల్లో వచ్చిన వార్తలపై బేషరతుగా విచారం వ్యక్తం చేస్తున్నా. న్యాయవ్యవస్థ, దాని స్వతంత్రత పట్ల నాకు అపార గౌరవం, విశ్వాసం ఉన్నాయి. రాజ్యాంగం, దాని విలువలను విశ్వసించే నేను.. ఎప్పటికీ న్యాయవ్యవస్థను అత్యున్నతమైనదిగా భావిస్తూనే ఉంటా' అని ట్వీట్ చేశారు.

**సుప్రీంనే తప్పుపడ్తరా?**

ఎమ్మెల్సీ కవిత బెయిల్ విషయంలో అడ్డగోలు వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డిపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సుప్రీంకోర్టు తీర్పును తప్పు పడ్తారా? అంటూ తీవ్రస్థాయిలో మండిపడింది. 'కోర్టులంటే గౌరవం లేదా?' అంటూ కన్నెర్రజేసింది. పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని తీవ్రంగా హెచ్చరించింది. ఢిల్లీ మద్యం విధానం కేసులో ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే. అయితే బీజేపీ-బీఆర్ఎస్ ఒప్పందంలో భాగంగానే కవితకు బెయిల్ వచ్చిందంటూ బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో సీఎం మాట్లాడుతూ.. సిసోడియా, కేజ్రీవాల్‌కు రాని బెయిల్ ఐదు నెలల్లోనే కవితకు ఎలా వచ్చిందని ప్రశ్నించారు. కవిత బెయిల్ కోసం బీఆర్ఎస్ ఎంపీ సీట్లను త్యాగం చేసిందని అన్నారు. ఈ వ్యాఖ్యలపై గురువారం సుప్రీంకోర్టు తీవ్రంగా



మండిపడింది. ఓటుకు నోటు కేసు విచారణను వేరే రాష్ట్రానికి తరలించాలంటూ మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది.

**సీఎం బాధ్యతగా ఉండాలి కదా..**

సీఎం రేవంత్‌రెడ్డి తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. ఇది చాలా పాత కేసు అని, ఇప్పటివరకు 25 మంది సాక్షులను విచారించారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. 'ఆయన (సీఎం రేవంత్‌రెడ్డి) నిన్న ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను ఈ రోజు పొద్దున పత్రికల్లో చదివాం. ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ముఖ్యమంత్రి అలాంటి వ్యాఖ్యలు చేయవచ్చా?' అని ప్రశ్నించారు. 'ఆయన ఏం అన్నారో ఓసారి చూడండి. మేము రాజకీయ పార్టీలను సంప్రదించి ఆదేశాలు ఇస్తామా?. ముఖ్యమంత్రిగా బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయవచ్చా?' అని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు కొందరి మనసుల్లో భయాందోళనలు కలిగించే అవకాశం ఉన్నదని అన్నారు. 'మేం రాజకీయ నాయకులను పట్టించుకోం. మా ఆదేశాలను ఎవరైనా విమర్శించినా ఇబ్బంది లేదు. మా మనస్సాక్షి ప్రకారం, మేము చేసిన ప్రమాణం ప్రకారం మా కర్తవ్యాన్ని నిర్వర్తిస్తాం' అని స్పష్టం చేశారు. జస్టిస్ విశ్వనాథన్ మాట్లాడుతూ.. 'ఒక ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి చేయాల్సిన వ్యాఖ్యలేనా ఇవి?. ప్రభుత్వం, న్యాయస్థానాల మధ్య పరస్పర గౌరవం ఉండాలన్న ప్రాథమిక నియమం కూడా తెలియదా?. వ్యవస్థల మధ్య భేదాభిప్రాయాలు ఉన్నా.. గౌరవం ఉండాలి కదా' అని ప్రశ్నించారు. 'ఇలాంటి ప్రవర్తన, ఇంత మొండి వైఖరి ఉంటే ఎలా?. కార్యనిర్వాహక, శాసన వ్యవస్థల్లో మేము (కోర్టులు) జోక్యం చేసుకోబోమని ఎప్పుడూ చెప్తుంటాం. అంతే గౌరవాన్ని మేము వారి నుంచి కూడా ఆశిస్తాం' అని జస్టిస్ గవాయి పేర్కొన్నారు. ఈ ఒక్క కారణంతో కేసు విచారణను పిటిషనర్ కోరినట్టు మధ్యప్రదేశ్ హైకోర్టు బదిలీ చేయాలని ఆదేశాలు ఇవ్వొచ్చు అన్నారు. 'సుప్రీంకోర్టు ఆదేశాలపై ధైర్యంగా వ్యాఖ్యలు చేయచ్చని అనుకుంటున్నారా. నిన్ననే ఒక అదనపు కార్యదర్శికి నోటీసులు ఇచ్చాం' అని మహారాష్ట్రకు చెందిన ఐఏఎస్ అధికారికి కోర్టు ధిక్కరణ నోటీసులు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. దేశంలోని అత్యున్నత న్యాయస్థానం పట్ల ఆయనకు గౌరవం లేకపోతే.. వేరే రాష్ట్రంలో కేసు విచారణను ఎదుర్కోమనండి.. అని జస్టిస్ గవాయి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దశలో రేవంత్‌రెడ్డి తరపున న్యాయవాదులు స్పందిస్తూ.. ఈ వ్యాఖ్యలు అవాంఛనీయమని, ఆయన తరపున సుప్రీంకోర్టును క్షమాపణలు కోరారు. మరోసారి ఇలా జరుగకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డికి కౌన్సెలింగ్ ఇస్తామని చెప్పారు. సీఎం వ్యాఖ్యలపై ఎలాంటి నోటీసులు ఇవ్వవద్దని విజ్ఞప్తిచేశారు. వారి విజ్ఞప్తి మేరకు కేసు విచారణను ధర్మాసనం సోమవారానికి వాయిదా వేసింది.

## శ్రీపతి ల్యాబ్‌లో పేలిన రియాక్టర్.. భయంతో పరుగులు తీసిన సిబ్బంది

**నల్లగొండ :** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి వద్ద గల శ్రీపతి ల్యాబ్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ల్యాబ్‌లో ఒక్కసారిగా రియాక్టర్ పేలడంతో భయంతో సిబ్బంది, చుట్టు పక్కల ప్రజలు భయంతో పరుగులు తీశారు.



రియాక్టర్ పేలడంతో చుట్టు పక్కల ప్రాంతాల్లో పొగ దట్టంగా వ్యాపించింది. ఘటనపై సకాలంలో స్పందించిన చిట్యాల పోలిసులు . ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాలతో హుటాహుటిన కంపెనీకి చేరుకొని ప్రమాద తీవ్రత పెరగకుండా చర్యలు చేపట్టారు. పోలీసుల, అగ్నిమాపక సిబ్బంది సంయుక్తంగా మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదం నుంచి సురక్షితంగా కంపెనీలోని కార్మికులు సురక్షితంగా బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

# ప్రైవేట్ ఏజెన్సీలకు లైసెన్స్‌లు

-మొదటిపేజీ తరువాయి

సెక్యూరిటీ సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం కూడా ఫిజికల్ సెక్యూరిటీలో పనిచేసే వారికి అండగా ఉంటుందన్నారు. కనీస వేతనం చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. హైదరాబాద్ పోలీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెక్యూరిటీ సమ్మిట్ నగర ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలను పోలీస్ శాఖ ప్రోత్సహించాలన్నారు. నగరం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో నగరానికి ప్రభుత్వం 10 కోట్లు బడ్జెట్‌లో కేటాయించిందని తెలిపారు. నగర ప్రజలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందన్నారు. ప్రైవేట్ ఏజెన్సీలు అందరు తప్పకుండ లైసెన్స్‌లు తీసుకోవాలన్నారు. తెలంగాణలో ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశలు కల్పించాలని అన్నారు. అట్టడుగున ఉన్న ప్రజలను ఆదుకోవాలన్నారు. పోలీస్ శాఖ ప్రైవేట్ సెక్యూరిటీలపై దృష్టి సారించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.




## సంపాదకీయం

# ఈ లైంగికదాడి వెనుక అదృశ్య హస్తాలెన్నో!

డాక్టర్ రథ్ గోవిందా కర్(ఆర్.జి.కర్) కలకత్తా హాస్పిటల్లో ఆగస్టు 9న ట్రైనీ డాక్టర్‌ను రేప్ చేసి, క్రూరాతి క్రూరంగా హత్య చేసిన సంఘటన దేశ ప్రజలను కలవరపెడుతోంది. ఈ మెడికల్ కాలేజీని 1886లో స్థాపించారు. ఆసియా ఖండంలోని మొట్టమొదటి వైద్యాలయంగా పేరుగాంచినది. ఇంతటి పేరు ప్రఖ్యాతులు గడించిన ఆసుపత్రిలో ఇలాంటి సంఘటన చోటు చేసుకోవడం అత్యంత విచారకరం. ఈ ఘటన జరిగాక, ఈ కేసుకు సంబంధించిన ఆధారాలను అదృశ్యం చేయడానికి వేల మంది టీఎంసీ కార్యకర్తలు హాస్పిటల్‌పై దాడి చేయడం, సీసీ కెమెరాలను ఆఫ్ చేయడం, ఈ సంఘటన జరిగిన సమయంలో ప్రిన్సిపల్‌గా ఉన్న సందీప్ కుమార్ ఘోష్‌ను ఆ స్థానం నుండి తొలగించి, ఉన్నత స్థానంలో పునర్ నియామకం చేయడం అంతుపట్టని విషయాలు. పైగా సాక్ష్యాలను తారుమారు చేయాలని రాష్ట్ర పోలీసు యంత్రాంగం ప్రయత్నించడం, ఇది ఆత్మహత్యగా చిత్రీకరించడం అత్యంత వివాదాస్పదంగా మారింది. ఈ ఉదంతంపై వాస్తవాలు వెలికి తీయాలని, దోషులను గుర్తించాలని వైద్యరంగంలో ఉన్న సిబ్బంది, అనేక సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు దేశవ్యాప్తంగా ఆందోళనకు దిగడంతో ఈ ఉదంతాన్ని సీబీఐకి అప్పజెప్పడం, భారత సుప్రీంకోర్టు ఈ కేసును సుమోటోగా స్వీకరించి, విచారణ చేపట్టడంతో ఈ ఉదంతానికి అత్యంత ప్రాధాన్యత వచ్చినదనడంలో అతిశయోక్తి లేదు. ఈ కేసును నీరుగార్చడానికి మమతా బెనర్జీ ప్రభుత్వం 5 మంది మహిళా న్యాయవాదులను, ఎనిమిది మంది మగ న్యాయవాదులను, దేశ వ్యతిరేక చర్యలకు పాల్పడిన దోషుల తరఫున వాదించడంలో పేరు ప్రఖ్యాతులు గడించిన మాజీ కేంద్రమంత్రి, కాంగ్రెస్ నాయకుడు కపిల్ సిబాల్‌ను తన ప్రభుత్వం తరఫున నియమించుకోవడం దేశ ప్రజలను సంభ్రమాశ్చర్యాలకు గురి చేసింది. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో బీజేపీ వ్యతిరేక ప్రభుత్వం ఉన్నందువలన ఈ ఉదంతాన్ని సున్నితమైనదిగా కొందరు మలుస్తున్నారని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇటువంటి సంఘటనలు జరగలేదా? అంటూ కొందరు స్వయం ప్రకటిత మేధావులు మీడియాలో రాస్తున్నారు. తప్పు ఏ ప్రభుత్వ హయాంలో జరిగింది అనేది కాదు ముఖ్యం, తప్పు చేసిన దోషులు ఎలాంటి వారైనా శిక్షించబడాలనేది ముఖ్యమైన విషయమని వీరు గ్రహిస్తే సమాజానికి కాస్తో, కూస్తో మేలు జరుగుతుంది. దొంగే - దొంగ, దొంగ అని అరచినట్లు ప్రభుత్వాన్ని నడిపే మమతా బెనర్జీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ర్యాలీ జరగడం అత్యంత విచారకరం. శోచనీయం. ఈ ఉదంతంతో సంబంధం ఉన్న వినయ్ రాయ్‌ని పోలీసులు అరెస్టు చేసి, సీబీఐకి అప్పజెప్పడం, సీబీఐ కోర్టు అనుమతితో పాలీగ్రాఫ్ టెస్టులు నిర్వహించడం జరిగింది. తాను నిర్దోషినని, తనను అనవసరంగా ఈ కేసులో ఇరికించారని జడ్జి ముందు వాపోవడం వాస్తవాలను దాచే విధంగా ఉంది. లైంగికదాడి చేసి క్రూరాతిక్రూరంగా,అమానుషంగా హత్య చేయడం వెనుక చనిపోయిన ట్రైనింగ్ డాక్టర్‌కూ, ఈ ఉదంతంలో ఇన్వాల్వ్ అయిన దోషులకూ మధ్య ప్రపంచానికి తెలియని విషయం ఏదో ఉంది. ఈ ఉదంతంలో పాలీగ్రాఫ్ టెస్టులకు గురైన ప్రిన్సిపల్ సందీప్ కుమార్ ఘోష్‌కి శరీర అవయవాలను అమ్మి సొమ్ము చేసుకునే అక్రమ వ్యాపారంతో సంబంధం ఉందని, ఆ కాలేజీ మాజీ ప్రిన్సిపల్ కలకత్తా హైకోర్టుకు ఫిర్యాదు చేయడం తో ఈ కేసు అనేక మలుపులు తిరిగింది. ఈ ఉదంతాన్ని సాకుగా చూపి, రాష్ట్రంలో గందరగోళాలు సృష్టించి, రాష్ట్రపతి పరిపాలన విధించి, రాజకీయ లబ్ధి పొందాలని కేంద్ర ప్రభుత్వం పావులు కదుపుతుందని మోడీ ప్రభుత్వ వ్యతిరేకులు కొందరు ఊహాగానాలు చేయడం జరుగుతోంది. ఈ కేసును రాద్ధాంతం చేసి, రాజకీయ లబ్ధిని పొందాలనుకుంటే అది జరగదు. ఇలాంటి 'కెపాసిటీ' బీజేపీ నాయకత్వానికి లేదు. కానీ కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలో ఉంటే తన కార్యకర్తలను ఎలా కాపాడుకోవాలో, కార్యకర్తలపై దాడులు చేసిన వారికి ఎలా బుద్ధి చెప్పాలో వారికి బాగా తెలుసు. కాంగ్రెసేతర ప్రభుత్వాలను కూల్చి, రాష్ట్రపతి పరిపాలన విధించి, రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులను తనకు అనుకూలంగా మలుచుకోవడంలో కాంగ్రెస్ పార్టీ నాయకులకు తెలిసినట్లు ఇంకెవరికీ తెలియదు. మన దేశం న్యాయవ్యవస్థపై, విచారణ సంస్థలపై ప్రజలకు నమ్మకం పూర్తిగా సన్నగిల్లింది. అందుకు కారణం లేకపోలేదు. దేశభద్రతతో ముడిపడిన విషయాలను సైతం మన దేశాన్ని న్యాయవ్యవస్థ, విచారణ సంస్థలు త్వరగా నిగ్గు తేల్చి దోషులను శిక్షించిన దాఖలాలు లేవు. ఈ కేసు విషయంలోనైనా న్యాయవ్యవస్థ, దర్యాప్తు సంస్థలు త్వరిత గతిలో విచారించి, దోషులను తేల్చాలని ప్రజల ఆకాంక్ష!


# పోషకాహారలోపం రేపటితరానికి శాపం!

దేశ ప్రధాన సమస్యల్లో పేదరికం, అధిక జనాభా, అవిద్య, ప్రజారోగ్యం, ఆర్థిక - సామాజిక అసమానతలు లాంటి పలు సమస్యలతో పాటు ఆహార అభద్రత సంక్షోభం అనాదిగా వెంటాడుతున్నాయి. నేడు ఆహార భద్రత సాధనలో కొంత మెరుగైన ఫలితాలను సాధించిన భారతంలో పోషకాహార భద్రత మాత్రం అందని ద్రాక్షే అవుతున్నది. ముఖ్యంగా పోషకాహార లోప విష వలయంలో చిక్కిన బాల భారతం రాబోయే నవతరానికి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నది. ఆహార లభ్యతతో ఆరోగ్యం సిద్ధించదని, పోషకాహార లభ్యతే సమాజ ఆరోగ్యానికి సంరక్షణ గొడుగుగా ఉపకరిస్తుందని మనకు తెలుసు. పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మింపబడుతుందని, పోషకాహార ప్రయోజనాలను అన్ని వర్గాల ప్రజలకు వివరించడానికి కేంద్ర మహిళ-శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ "ఫుడ్ అండ్ న్యూట్రిషన్ బోర్డ్" సౌజన్యంతో 1982 నుంచి ప్రతి ఏట సెప్టెంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు "జాతీయ పోషకాహార వారోత్సవాలు (నేషనల్ న్యూట్రిషన్ వీక్)" నిర్వహించడం ఆనవాయితీగా మారింది. సెప్టెంబర్ మాసాన్ని "జాతీయ పోషకాహార మాసం"గా కూడా పాటిస్తూ "భవిష్యత్తుకు ఇంధనం(ఫ్యుయల్ ఫర్ ది ఫ్యూచర్)" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతున్నది. జాతీయ పోషకాహార వారోత్సవాలు-2024నినాదంగా "ప్రారంభం నుంచే సరైన పోషకాహారం అందిద్దాం (ఫీడింగ్ స్మార్ట్ రైట్ ఫ్రమ్ స్టార్ట్)" అనబడే అంశాన్ని తీసుకొని అవగాహన కల్పిస్తున్నారు. ప్రజారోగ్య సాధనకు పునాది పోషకాహారమే. పోషకాహారం తీసుకోవడంతో గుండె జబ్బులు, గుండె పోటు, మధుమేహం, క్యాన్సర్ లాంటి జబ్బులు దూరం అవడమే కాకుండా సంపూర్ణ మానసిక-శారీరక ఆరోగ్యం కూడా సిద్ధిస్తుంది. ఇండియాలో ఐదేళ్లలోపు బాలల్లో ప్రతి ముగ్గురిలో ఒకరు దీర్ఘకాలం పాటు పోషకాహార కొరల్లో చిక్కి శరీరక ఎదుగుదల లోపంతో (స్టంటెడ్ గ్రోత్) బాధపడుతున్నట్లు తెలుస్తున్నది. పోషకాహార లోపం, పేదరికం, అవిద్య, సురక్షిత నీటి కొరత, పరిసరాల అశుభ్రత లాంటి సమస్యల కారణంగా బాలల శారీరక-మానసిక ఎదుగుదల కుంటుపడుతున్నది. సాధారణ ప్రజలతో పాటు మహిళలు, గర్భిణీలు, కుటుంబ పెద్దలు, నిరక్షరాస్యులు వంటి వర్గాలతో పాటు పోషకాహార లోపం పట్ల విద్యాలయాల్లో తప్పనిసరిగా అవగాహనలు కల్పించాలి. పోషకాహార అంశాలను పాఠ్యాంశాల్లో చేర్చడం ఎంతో మేలును చేస్తుంది. ప్రజల, స్వచ్ఛంద సంస్థలు, పౌర సంఘాలు, ప్రభుత్వ శాఖలు, ప్రజారోగ్య వ్యవస్థల సమన్వయంతో పోషకాహార ప్రయోజనాలను గ్రామీణ స్థాయికి చేర్చడం జరగాలి. సమతుల పోషకాహారంలో ఎదుగుదలకు అవసరమైన పిండి పదార్థాలు, ఒమెగా-3 కొవ్వులు, మాంసకృత్తులు, నీరు, విటమిన్లు, ఖనిజ లవణాలు, పీచు పదార్థాలు లాంటివి తప్పనిసరిగా సరైన పాళ్లలో అవసరం అవుతాయి. ఈ పదార్థాలు సమపాళ్ళలో ఉన్న ఆహారాన్ని మాత్రమే "సమతుల ఆహారం(బ్యాలెన్స్‌డ్ డయట్)"గా పిలుస్తారు.బాలల్లో వయసుకు తగిన పొడవు, బరువు, చురుకుదనం, శక్తి కలిగి ఉండడానికి పోషకాహారం దోహదపడుతుంది. వ్యాధినిరోధక శక్తి సమకూరడం, మానసిక స్థితుల్లో సమతుల్యత, జీవిత కాలం పెరగడం, దీర్ఘకాలిక జబ్బులకు దూరంగా ఉండడం, క్రియాశీలత పెరగడం, వృత్తిలో సాఫల్యతలు, ఏకాగ్రత పెరగడం, ఎల్లవేళల ఆరోగ్యం సిద్ధించడం, సంపూర్ణ ఆరోగ్యంతో ఆర్థిక చిక్కులు దూరం కావడం, దేశాభివృద్ధిలో పాలు పంచుకోవడం లాంటి పలు పోషకాహార ప్రయోజనాలు కలుగుతాయని తెలుసుకోవాలి. జాతీయ పోషకాహార వారోత్సవాల వేదికగా పోషకాహార ప్రయోజనాలను సామాన్యులకు అవగాహన పరచడానికి పలు సభలు, సమావేశాలు, సదస్సులు, కార్యశాలలు, పోషకాహార ప్రదర్శనలు, విద్యాలయాల్లో పోషకాహార అంశాల్లో పోటీలు, వైద్యరోగ్య శిబిరాలు, వంటల పోటీలు, రైతులకు అవగాహనలు, సామాజిక వనాల నిర్వహణలు, ఆన్‌లైన్/సామాజిక మాధ్యమ వేదికగా ప్రచారాలు, వెల్ బేబీ షోల నిర్వహణ లాంటివి నిర్వహిస్తున్నారు. మూలిగే నక్కపై తాటి పండు పడినట్లు, పేదరికంతో పోరాడుతున్న ప్రపంచ మానవాళి జీవితాల్లో కరోనా విపత్తు పిడుగులా పడడం, అన్ని వర్గాల ప్రజలకు తీవ్రమైన దీర్ఘకాలిక ఆహార అభద్రత కమ్ముకోవడం జరగడం విచారకరం. అన్ని రకాల పండ్లు, కూరగాయలు, ఆకు కూరలు, అతిగా పాలిష్ చేయని బియ్యం/గోధుమలు, డ్రై ఫ్రూట్స్, ఓట్స్, కీర దోసకాయలు/క్యారెట్/బీట్ రూట్ సలాడ్స్, చేపలు, తృణధాన్యాలు, ప్రోటీన్ ఫుడ్స్, గుడ్లు, మాంసం, చిక్కుళ్లు, సంతృప్త ట్రాన్స్ కొవ్వులు, అనారోగ్య కొవ్వు పదార్థాల వాడకాన్ని తగ్గించడం, పరిమిత పిండి పదార్థాలు లాంటి పోషకాహారాలను తీసుకోవడానికి ప్రయత్నాలు చేయాలని సూచిస్తున్నారు. ఫాస్ట్ ఫుడ్స్, నిల్వ ఉంచిన ప్యాకెట్ ఫుడ్స్, శీతలపానీయాలు, నూనెలో ఫ్రై చేసిన పదార్థాలు, కొవ్వులు తక్కువగా ఉన్న ఆహారం, లవణం/సోడియం/షుగర్/ కొవ్వులు అధికంగా ఉన్న పదార్థాలు, ఫ్రిజ్‌లో నిలువ ఉన్న ప్యాకెట్ ఫుడ్స్, చాక్లెట్లు, సోడా పానీయాలు, ఎరుపు రంగు మాంసం, అధిక లవణాలున్న స్నాక్స్, ప్రాసెస్డ్ ఫుడ్, స్ట్రీట్ ఫుడ్స్ లాంటి పలు రకాలైన ఆహారాల నుంచి దూరంగా ఉండాలని అవగాహన కల్పించాలి. పోషకాహారమే సంపూర్ణ ఆరోగ్య మహాభాగ్యమని నినదిద్దాం. అభాగ్యులైన బక్కచిక్కిన భారతానికి పోషకాహార గొడుగు పట్టి ఆరోగ్యకర సమాజ స్థాపనకు సిద్ధం అవుదాం. బాలలు, గర్భిణులు, శిశువులకు పోషకాహారం అందిస్తే ఆరోగ్యకర భవిత నిర్మితమవుతుందని నమ్ముదాం. పళ్లెం నిండా పచ్చడి మెతుకులతో కడుపు నింపుకోవడం సరికాదని, పోషకాహారాన్ని రెండు ముద్దలు తిన్నా మేలు అని ప్రచారం చేద్దాం. పోషకాహార లోపాన్ని తరిమి వేస్తూ, ఆరోగ్య సౌభాగ్య భారతాన్ని నిర్మించడంలో మనందరం భాగస్వాములం అవుతూ, రేపటి ఆరోగ్య బాల భారతాన్ని నిర్మించుకుందాం.



# హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్

ధ్యాన్ చంద్ (1905, ఆగస్టు 29 -1979, డిసెంబరు 3) సాటిలేని భారతీయ హాకీ ఆటగాడు. హాకీ క్రీడలో ప్రపంచ అత్యుత్తమ క్రీడాకారుల్లో ఒకడు. గోల్స్ చేయడంలో అద్భుత ప్రతిభ కనబరిచేవారు. హాకీలో భారత్‌కు చారిత్రాత్మక విజయాలు అందిం చడంతో పాటు, ఎన్నో అరుదైన ఘనతలు సొంతం చేసుకున్నారు. భారత్ అసలు సిసలు క్రీడా దిగ్గజంగా ధ్యాన్ చంద్‌కు పేరుంది. భారత దేశానికి హాకీలో స్వర్ణ యుగంగా పరిగణించదగిన 1928, 1932, 1936 ఒలంపిక్ క్రీడల్లో వరుసగా బంగారు పతకాలు సాధించి పెట్టారు. క్రీడారంగంలో అత్యుత్తమ ప్రదర్శన చేసిన వారికి ఖేల్ రత్న అవార్డు ఇస్తారని చాలా మందికి తెలుసు. ఈ ఖేల్ రత్న అవార్డు నిన్నటి దాకా రాజీవ్ ఖేల్ రత్నగా పిలవబడగా.. ధ్యాన్ చంద్ సేవలకు, దేశ భక్తికి గుర్తింపుగా దాని పేరు ధ్యాన్ చంద్ ఖేల్ రత్నగా కేంద్ర ప్రభుత్వం ఇటీవలే మార్చింది. హాకీ దిగ్గజం ధ్యాన్ చంద్ పుట్టిన రోజునే దేశంలో జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపు కుంటు న్నారు. దేశానికి మూడు ఒలంపిక్స్ పతకాలు అందించిన ధ్యాన్ చంద్ గురించి నేటి తరానికి పెద్దగా తెలియకపోవచ్చు. హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ జయంతి 1905 ఆగస్టు 29న ధ్యాన్‌చంద్ జన్మించారు. మెరుపు వేగంతో గేల్స్ చేయగల మాంత్రికుడిగా ఆయన క్రీడా చరిత్రలో సుస్థిర స్థానం సాధించారు. మైదానంలో పాదరసంలా కదిలిపోతూ బంతిని పూర్తిగా తన నియంత్రణలో ఉంచుకోవడంలో ఆయనకు ఎవరూ సాటిరారు. హాకీలో భారత్‌కు చారిత్రాత్మక విజయాలు అందించడంతో పాటు,ఎన్నో అరుదైన ఘనతలు సొంతం చేసుకున్నారు. భారత్ అసలు సిసలు క్రీడా దిగ్గజంగా ధ్యాన్ చంద్‌కు పేరుంది. 29 ఆగస్ట్ 1922న తన 17వ పుట్టినరోజున చంద్ బ్రిటిష్ ఇండియన్ ఆర్మీలో సిపాయిగా చేరాడు. ధ్యాన్‌చంద్ నేతృత్వంలో భారత పురుషుల హాకీ జట్టు మూడు సార్లు ప్రతిష్టాత్మక ఒలింపిక్స్ పతకాలు సాధించింది. 1928 ఆమ్‌స్టర్ డామ్,1932 లాస్ ఏంజిలెస్,1936 బెర్లిన్ ఒలింపిక్ గేమ్స్‌లో భారత్‌కు బంగారు పతకాలు అందించిన




ఘనత ధ్యాన్‌చంద్‌కే దక్కింది. చంద్రుడి వెలుతురు లోనూ ఆయన ప్రాక్టీస్ చేసేవారు. అందుకే ఆయన్ను ముద్దుగా చంద్‌గా పిలిచేవారు. 1936నాటి ఒలంపిక్స్ సందర్భంగా బెర్లిన్‌లో పెద్ద ఎత్తున ధ్యాన్ చంద్ పోస్టర్లు వెలిశాయి. ధ్యాన్ చంద్ ఆట చూసేందుకు స్టేడియంకు రావాలంటూ ఆయన ఫ్యాన్స్ ఈ పోస్టర్లు ఏర్పాటు చేశారు. ఆ ఒలంపిక్స్ హాకీ ఫైనల్ మ్యాచ్ లో భారత్ జర్మనీతో తలపడింది. ఆ ఫైనల్ మ్యాచ్ లో భారత్ 16-1 తేడాతో జర్మనీని మట్టి కరిపించింది. భారత్ పక్షాన ధ్యాన్ చంద్ 15 గోల్స్ చేసి చరిత్ర సృష్టించాడు. ఫైనల్స్‌లో ద్వితీయార్థంలో ధ్యాన్ చంద్..తన షూ, సాక్స్‌ను తీసేసి మ్యాచ్ ఆడారు. అయినా మూడు గోల్స్ సాధించి ఔరా అనిపించే ఆట ప్రదర్శించారు. ఆ సమయంలో స్టేడియంలో దాదాపుగా 25 వేల మంది ప్రేక్షకులతో పాటు గొప్ప నియంతగా పేరొందిన ఎడల్ఫ్ హిట్లర్ కూడా ఆ మ్యాచ్ ని తిలకించాడు. మ్యాచ్ ముగిసిన అనంతరం ధ్యాన్ చంద్ వద్దకి వచ్చిన హిట్లర్ తన సహచరులతో "అతడి హాకీ స్టిక్ విరగ్గొట్టి చూడండి.. అందులో తప్పకుండా ఏదో అయస్కాంతం ఉండి ఉంటుంది లేకపోతే ఇలా ఎలా ఆడతాడు" అని హాకీ స్టిక్ విరగ కొట్టగా ఎలాంటి అయస్కాంతమూ దొరకలేదు. దాంతో కంగుతిన్న హిట్లర్ అదేరోజు రాత్రి ధ్యాన్ చంద్ ని తన వద్దకు పిలిపించుకొని హాకీ ఆట కాకుండా నువ్వు ఏమేమి చేస్తావని ధ్యాన్ చంద్ ని అడగగా "నేను ఆర్మీలో సుబేదార్ గా పని చేస్తున్నానని సమాధానం ఇచ్చాడు. హిట్లర్ "ధ్యాన్ చంద్, నీ దేశము నీకేమిచ్చింది..? ఈరోజుకు నువ్వు కేవలం సుబేదార్ వి. జర్మనీ హాకీ జట్టు తరపున ఆడితే తక్షణమే నిన్ను ఎయిర్ ఫీల్డ్ మార్షల్ గా నియమిస్తానని చెప్తూతుండగా...తమరు ఎన్ని పదవులు ఇచ్చినా, ఎంత డబ్బు ఇచ్చిన నేను నా దేశానికి మాత్రమే ఆడుతాను. పరాయి దేశాలకోసం ఆడను.." అని తెగేసి చెప్పగానే హిట్లర్ నిర్ఘాంతపోయి తలదించు కున్నట్లు చెపుతారు. ఒకసారి తను గోల్ వేసిన తరువాత అది పడకపోతే తను గోల్ వేసిన విధానం చూసి గోల్పోస్ట్ కొలతలు సరిచూడ వలసిందిగా అంపైర్ ను కోరగా అది సరియైన గుర్తింపుగా అందరి మన్ననలు పొందారు. ఓ మ్యాచ్ సందర్భంగా ధ్యాన్ చంద్ ప్రత్యర్థులపై ఒక్క గోల్ కూడా చేయలేక పోయారు. గోల్ పోస్ట్ విషయంలో రిఫరీకి ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత పరిశీలనలో గోల్ పోస్ట్ అంతర్జాతీయ ప్రమా ణాలకు అనుగుణంగా లేనట్లు రుజువు అయింది. 1926 నుండి ఆయన 185 మ్యాచ్ ల్లో 570 గోల్స్ చేసి 1949 వరకు అంతర్జా తీయంగా ఆడారు. 2002లో ఢిల్లీలోని నేషనల్ స్టేడియంకు ధ్యాన్ చంద్ నేషనల్ స్టేడియంగా నామకరణం చేశారు. అలాగే అలిఘడ్ ముస్లిం యూని వర్సిటీలోని ఓ హాస్టల్‌కు ఆయన పేరు పెట్టారు. లండన్‌లోని ఇండి యన్ జింకానా క్లబ్‌కు ధ్యాన్ చంద్ పేరు పెట్టారు. ధ్యాన్ చంద్ పేరిట పోస్టల్ స్టాంప్ విడుదల చేసి భారత ప్రభుత్వం గౌరవించింది. ఇప్పటి వరకు ఆ గౌరవాన్ని పొందిన ఏకైక భారత హాకీ క్రీడాకారుడు ఆయనే. 34 సంవత్సరాల సేవ తర్వాత, ఆయన 29 ఆగస్టు 1956న భారత సైన్యం నుండి లెఫ్టినెంట్ (యాక్టింగ్ కెప్టెన్ ) గా పదవీ విరమణ చేశారు . భారత ప్రభుత్వం అదే సంవత్సరం ధ్యాన్ చంద్ కు భారతదేశ మూడవ అత్యున్నత పౌర పురస్కా రమైన పద్మ భూషణ్‌తో సత్కరించింది.

# అప్పటికీ, ఇప్పటికీ ఏం మారినట్లు?

దేశం 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సన్నద్ధం అవుతున్న వేళ సరిగ్గా ఒక్కరోజు ముందు నడిరేయిన కలకత్తా ఆర్.జి కర్ మెడికల్ కళాశాల, ప్రభుత్వ హాస్పిటల్‌లో ద్వితీయ సంవత్సరం పోస్ట్ గ్రాడ్యుయేట్ పల్మనాలజీ విభాగంలో వైద్య విద్యను అభ్యసిస్తున్న 31 ఏండ్ల వైద్య విద్యార్థినిపై దారుణమైన లైంగిక దాడి చేసి హత్య చేశారు. అత్యంత అమానవీయమైన ఈ హత్యాచారాన్ని నిరసిస్తూ, పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ కల్పించాలని, గంటల తరబడి డ్యూటీ చేస్తున్న మహిళా డాక్టర్లకు కనీస విశ్రాంతి కోసం ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన సదుపాయాలు కావాలని దేశవ్యాప్తంగా డాక్టర్లు, ప్రజలు నిరసన కార్యక్రమాలు చేశారు. కోల్‌కతాలో అర్ధరాత్రి మహిళలు రోడ్డెక్కిన తీరు 1970లో మహిళలపై లైంగిక వేధింపులు, లింగ వివక్షతకు నిరసనగా లింగ సమానత్వం కోసం సాగిన మహిళా ఉద్యమాలను గుర్తు చేశాయి. 12 సంవత్సరాల క్రితం దేశ రాజధాని ఢిల్లీలో అర్ధరాత్రి ఆడపిల్లపై జరిగిన అఘాయిత్యంతో దేశ ప్రజల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. న్యాయంకై దేశం నలుమూలలా సాగిన ఆందోళనలు మళ్లీ గుర్తుకొస్తున్నాయి. కలకత్తాలోని జాదవ్ పుర వీధుల్లో ఈ ఘటనపై నిరసన తెలుపుతున్న ఓ స్త్రీవాది తన టీ- షర్ట్‌పై అప్పటి నుండి ఇప్పటికీ ఏం మారింది? అని ఆంగ్ల భాషలో రాసి ఉన్న అక్షరాలు అందరినీ ఆలోచింపజేస్తున్నాయి. వాస్తవానికి ఢిల్లీ నిర్భయ ఘటన నుండి నేటి కలకత్తా ఘటన వరకు మహిళల సంరక్షణలో ప్రభుత్వాలు ఏం ప్రగతిని సాధించాయి? అందరిలో తలెత్తే సాధారణ ప్రశ్న ఏంటంటే అసలు ఈ దేశంలో మహిళలకు స్వేచ్ఛ, సమానత్వం, వారి పట్ల కనీస పట్టింపు ఎక్కడుందీ? ఆగస్టు 9న విరామం లేకుండా సుమారుగా 36 గంటల పాటు డ్యూటీ చేసిన వైద్య విద్యార్థిని, రాత్రి 2 గంటల ప్రాంతంలో విశ్రాంతి తీసుకునేందుకు సెమినార్ హాల్‌కి వెళ్లింది. గంటల తరబడి పనిచేసే అనేక విభాగాల డాక్టర్లకు విశ్రాంతి తీసుకునేందుకు రెస్ట్ రూములు లేవని పలువురు డాక్టర్లు ఆయా సందర్భాలలో వెల్లడించారు. దీని కారణంగా విశ్రాంతి కోసం పేషంట్ బెడ్‌పై లేదా వెయిటింగ్ హాల్స్‌లలో లేదా ఖాళీ గదుల్లో పడుకోవడం తప్ప జూనియర్ డాక్టర్లకు వేరే మార్గం లేదు. ఆ రాత్రి చనిపోయిన వైద్య విద్యార్థిని తమ కుటుంబీకులతో ఎప్పటిలాగానే ఆ రోజూ మాట్లాడింది. కానీ ఒక్క రోజులోనే తన కలల సౌధం కుప్పకూలింది. తల్లిదండ్రులు తన భవిష్యత్తుపై పెట్టుకున్న ఆశలన్నీ అడియాశలయ్యాయి. ఆగస్టు 9 నుండి వైద్య విద్య శిక్షణ పొందుతున్న ప్రతీ డాక్టర్ బాధితురాలికి న్యాయం చేయాలంటూ, ఆసుపత్రుల్లో మహిళా డాక్టర్లకు రక్షణ కల్పించాలని కోరుతూ తమ సేవలను నిలిపివేశారు.


# గిరిజన తండాలో త్రాగునీటి కోసం ఎమ్మెల్యే బాలు నాయక్ సత్వర పరిష్కారం




**ఎమ్మెల్యే చొరవతో అధికారులు అప్రమత్తం**

**చింతపల్లి. ఆగస్టు 30 శాసనసభ న్యూస్ ప్రతినిధి:** చింతపల్లి మండల పరిధిలోని ప్రశాంత్ పురి గ్రామపంచాయతీ పరిధిలో గల హరిచంద్రపురం తండాలో గత కొంతకాలంగా కృష్ణ త్రాగునీటి కోసం ఆ తండా గిరిజనులు తీవ్ర ఆస్తులు ఎదుర్కొంటున్నప్పటికీ నేటి వరకు ఎవరు కూడా పట్టించుకోలేదని ఆ గ్రామ గిరిజనులు పలుమార్లు అధికారుల ముందు వాపోయారు. గత ఐదునెలల నుండి మండలంలో సర్పంచుల పదవి పూర్తికావడంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుంది. అయినప్పటికిని ఆ తండ గిరిజనులు ఎదుర్కొంటున్న త్రాగునీటి సమస్యలను నేటి వరకు గత ప్రభుత్వ అధికారులు కానీ, సర్పంచ్ గాని పట్టించుకున్న దాఖలాలు లేవు, ఈ విషయమే పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చోద్యం చూశారే తప్ప సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు కరువయ్యారని ఆ గ్రామగిరిజనులు ఆవేదన వ్యక్తపరిచారు. ఈ విషయమై స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కేతావత్ కిషన్ నాయక్ వెంటనే స్పందించి సమస్యను దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. త్రాగునీటి విషయమై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే బాలు నాయక్ మిషన్ భగీరథ ఏ ఈ డి ఈ లకు , ఫోన్ ద్వారా ఆ గ్రామ సమస్యను తెలియపరిచారు. వెంటనే మిషన్ భగీరథ త్రాగునీటి విషయమై ఆతండాకు అవసరమైన చర్యలు తీసుకొని ఆ గ్రామ సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. హరిచంద్రపురంలో ట్యాంకు సరిగానీళ్లు ఎక్కకపోవడంతో ఈసమస్యలకు ఉన్నదని మిషన్ భగీరథ అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. మిషన్ భగీరథ పైప్ లైన్ కోసం సాగర్ హైవే రోడ్డును కట్ చేయాల్సిన అవసరం ఉందని అందుకు ఆర్ అండ్ బి అధికారుల పర్మిషన్ అవసరం ఉందని మిషన్ భగీరథ అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. తాను ఆర్ అండ్ బి అధికారులతో మాట్లాడి పర్మిషన్ ఇప్పిస్తానని అధికారులకు సూచించారు. త్వరితగతిన ఆపనులు పూర్తి చేసి ట్యాంకు సరిగ్గానీరు అందే విధంగా చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడారు.అదేవిధంగా గ్రామంలో ఎలాంటి విద్యుత్ సమస్య కూడా నెలకొనకుండా చూడాలని విద్యుత్ అధికారులకు సూచించారు. గత కొంతకాలంగా హరిచంద్ర పురం తండాలో నెలకొన్న త్రాగునీటి సమస్యను ఎమ్మెల్యే బాలునాయక్ సత్వర పరిష్కానికి చర్యలు తీసుకోవడం హర్షించదగ్గ విషయమని ఆ గ్రామ గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.అధికారులు వెంటనే సమస్యల పరిష్కారం కోసం చొరవ తీసుకోవడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ నాయకులు కిషన్ నాయక్, గ్రామ ప్రజలు ఎమ్మెల్యే బాలు నాయక్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.

## పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమును ప్రారంభించిన డిసిపి సునీత రెడ్డి

**లిరామోజీ ఫిలిం సిటీ యాజమాన్యం సహకారంతో 15 లక్షల వ్యయంతో 50 సీసీ కెమెరాలు ఏర్పాటు**

**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 30 శాసనసభ న్యూస్ ప్రతినిధి:** **రామోజీ ఫిల్మ్ సిటీ (ఆర్ ఎఫ్ సి)** యాజమాన్యం సహకారంతో ఇబ్రాహింపట్నం పోలీసులు నేరాలను నిరోధించడానికి నేరాలను ధర్యాప్తు చెయ్యడానికి ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిదిలో 15 లక్షల వ్యయంతో 18 ప్రధాన కూడలిలో మొత్తం 50 సీసీ కెమెరాలను ఏర్పాటు చెయ్యడం జరిగింది. శేరిగూడ గ్రామ పరిధి కూడలిలో కొన్ని కెమేరాలు, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన కూడళ్లలో,నాగార్జున సాగర్ హై వే మార్గంలో కొన్ని కెమేరాలను ఏర్పాటు చేసి, కెమేరాలను పి ఎస్ ఇబ్రాహింపట్నం కు అనుసంధానం చేసి ప్రధాన కూడలిలో వాహన రాకపోకలను, రోడ్డు ప్రమాధాలను జరిగిన నేరాలను, నేరస్తుల కదలికలను గమనించడానికి వీలుగా కమాండ్ కంట్రోల్ ను ఏర్పాటు చెయ్యడం జరిగింది. శుక్రవారం నాడు రామోజీ ఫిల్మ్ సిటీ యాజమాన్యం, ఏసిపి ఇబ్రహింపట్నం డివిజన్, ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పి ఎస్ ఇబ్రహీంపట్నం సిబ్బంది వారి ఆద్వర్యంలో డిప్యూటీ కమీషనర్ ఆఫ్ పోలీస్, సునీత రెడ్డి మహేశ్వరం జోన్, రాచకొండ ముఖ్య అతిధిగా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ లో గల కమాండ్ కంట్రోల్ రూమ్ ను ప్రారంభించారు. అనంతరం ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన కెమేరాల యొక్క ఫుటేజ్ లను టెక్నీషియన్ ల సహకారంతో కమాండ్ కంట్రోల్ రూమ్ లో పరిష్కరించడం జరిగింది. 5 సంవత్సరాల పాటు ఈ సి సి కెమెరాల పూర్తి భాద్యత చూసుకుంటామని రామోజీ ఫిల్మ్ సిటీ యాజమాన్యం చెప్పడంతో డిసిపి సునీత రెడ్డి హర్షం వ్యక్తం చేసి వారికి అభినందనలు తెలిపినారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కొంటె కల్తీ తింటే పట్టీ...






**అడుగడుగునా కల్తీ ఆహారం.. అధికారులు పట్టించుకోరా?**

**నాగోల్ లో జోరుగా ఆహార పదార్థాల కల్తీ**

**- నాణ్యతా ప్రమాణాలు పాటించని వ్యాపారులు**

**- ప్రజల ప్రాణాలతో చెలగాటం**


**- పట్టించుకోని అధికార యంత్రాంగం.**

**ఎల్ బి నగర్,ఆగస్టు 30(శాసన సభ న్యూస్ ):** కల్తీ ఆహార పదార్థాలు మార్కెట్‌లో రాజ్యమేలుతున్నాయి. తయారీదారులు కనీస నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదు. ఆయా ఆహార పదార్థాలపై తయారీ తేదీ, ఎంత కాలంలోగా వినియోగించాలనే వాటిని ముద్రించకుండానే విక్రయిస్తున్నారు నగరం నడిబొడ్డున కూడా కల్తీ దందా నిర్వహిస్తూ.. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. నెలలు తరబడి మగ్గిన ముడి పదార్థాలు, అపరిశుభ్ర వాతావరణం, ఫ్లేవర్ల కోసం రంగులు వాడుతూ.. అక్రమార్జన కోసం నేరగాళ్లు ఎంతకైనా తెగిస్తున్నారు. ఎక్కడ చూసినా కల్తీ ఆహారం.. ధనార్ధనే ధ్యేయంగా కల్తీ ఆహారం అమ్ముతున్నారు కొంతమంది వ్యాపారులు నాగోల్ లోని జైపూర్ కాలనీ లో అపరిశుభ్రమైన స్థలంలో ముఖాలకు మాస్కులు, చేతులకు ధరించకుండానే సిబ్బంది చెకోడీలు, మిక్చర్, తయారు చేస్తున్నారు. పార్సిళ్లకు ప్లాస్టిక్ పాత్రలు, కవర్లనే వినియోగిస్తున్నారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే ప్రమాదముండగా ప్రత్యేకంగా చేతులకు కవర్లు ధరించి వడ్డించాల్సిన నిర్వాహకులు అవేవీ పాటించడం లేదు. మురికి కాలువ పక్కనే చెకోడీలు మిక్చర్ తయారు చేస్తున్నారు.కొద్ది రోజులుగా జిల్లా ఆసుపత్రికి టైఫాయిడ్, జ్వరాల బాధితులు పదుల సంఖ్యలో వస్తుండగా, ఇందులో ఎక్కువ మంది కలుషిత ఆహారం తీసుకున్న వారేనని వైద్యులు చెబుతున్నారు.

**కరువైన అధికారుల పర్యవేక్షణ...**

హైదరాబాద్ లో అనేక రకాల ఆహార పదార్థాలు, సరుకుల విక్రయ తయారీ కేంద్రాలు వెలుస్తున్నా ఫుడ్ ఇన్స్పెక్టర్లు మాత్రం ఇటువైపు కన్నెత్తి చూడ టం లేదు. నాణ్యతా ప్రమాణాలను పట్టించుకోకుండా వ్యాపారాలు కొన సాగిస్తూ ప్రజల ఆరోగ్యాలను దెబ్బతీస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకో కపోవడం గమనార్హం. ఇప్పటికైనా ప్రజల ప్రాణాలతో చెలగాటమడు తున్న కల్తీనూనె, ఆహార పదార్థాల, విక్రయదారుల, తయారీ దారులపై ఫుడ్ సేఫ్టీ అధికారులు నిఘా ఏర్పాటు చేసి అవసరమైన చర్యలు చేప ట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## పురుగుల మందు సేవించి ట్రైని కానిస్టేబుల్ మృతి

**చింతపల్లి, ఆగస్టు 30 శాసనసభ న్యూస్ ప్రతినిధి:** కన్న కలలు నెరవేరకముందే అర్ధాంతరంగా ఓ ట్రైనింగ్ కానిస్టేబుల్ తన వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చింతపల్లి మండలం కేంద్రంలో చోటుచేసుకుంది. చింతపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చింతపల్లి గ్రామానికి చెందిన పాలకూర్ల ఆంజనేయులు తండ్రి సత్తయ్య, అనే యువకుడు ఇటీవల హైదరాబా దులోని గోషామహల్ ట్రైనింగ్ సెంటర్లో ఉద్యోగరీత్యా ట్రైనింగ్ తీసుకుంటున్నాడు. సెలవుల్లో భాగంగా ఆగస్టు 25 న ఎనిమిది గంటల ప్రాంతంలో హైదరాబాదు నుండి చింతపల్లికి తన స్వగ్రామానికి చేరుకున్నాడు. ఆగస్టు 28న ఉదయం 8:30 ప్రాంతంలో బోరు బావి వద్దకు వెళ్లి స్నానం చేసి వస్తానని ఇంట్లో వాళ్లకు చెప్పి వెళ్ళాడు. స్నానం చేసి వస్తానని వ్యవసాయ పొలం వద్దకు వెళ్లిన ఆంజనేయులు తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లిచూడగా పురుగుల మందుతాగి ఉండటంతో గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆంజనేయులు మాల్ లోని ఓప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అదే రాత్రి మెరుగైన వైద్యం కోసం హైదరాబాదులోని బంజారాహిల్స్ లో ఉన్న కేర్ ఆసుపత్రికి తరలించారు.గత మూడు రోజుల నుండి చికిత్స పొందుతూ శుక్రవారం 11 గంటల ప్రాంతంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. గత కొద్ది రోజుల నుండి ఆంజనేయులు మానసిక స్థితిసరిగ్గా లేనందున తనకు గుబులు గుబులుగా ఉందంటూ నేనుబ్రతకను చనిపోతానని ఒకటిరెండు సార్లు కుటుంబసభ్యులతో పేర్కొన్నాడు. నాకుమారుడు మరణం పట్ల ఎలాంటి అనుమానాలు లేవని తండ్రి పాలకూర్ల సత్తయ్య పేర్కొన్నాడు. మాపిల్లవాడి మతిస్థిమితం సరిగా లేకనే పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడని తండ్రి సత్తయ్య పేర్కొన్నాడు. మృతుడి తండ్రి సత్తయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చింతపల్లి సబ్ ఇన్స్పెక్టర్ బీనముని యాదయ్య తెలిపారు.

## త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో భగవద్గీత శ్లోకాల పోటీలు




**కొండమల్లేపల్లి, ఆగస్టు 30 శాసనసభ న్యూస్:** త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి తరఫున నల్గొండ కమిటీ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా కొండమల్లేపల్లి లో శుక్రవారం భగవద్గీత శ్లోకాలు ఫైనల్ పోటీలు జరిగాయి. పోటీలలో మొదటి బహుమతి పొందిన సాయి సిద్ధార్థ పాఠశాల విద్యార్థి ఎన్.సాత్విక్ రెండో బహుమతి పొందినగౌతమి స్కూల్ విద్యార్థి ఎం.విద్య మూడో బహుమతి పొందిన కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థి ఇ.కిరణ్ భగవద్గీతశ్లోకాల పోటీలోసాయి సిద్ధార్థ స్కూల్, గౌతమి , కృష్ణవేణి , రెయిన్బో , సంస్కృతి స్కూల్ పాఠశాలలు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందు జ్ఞాన వేదిక నల్గొండ కమిటీ అధ్యక్షుడు, సభ్యులు పగిడిమర్రి వెంకటేశం,మేకల శ్రీనివాసులు, మేకల చంద్రమౌళి ,చక్రధర్,పరమేష్ ,కార్తీక్ ,రంగారెడ్డి ,వెంకటమ్మ, కవిత లు పాల్గొన్నారు.

## నీటి సంపులో పడి బాలుడు మృతి



**కొండమల్లేపల్లి, ఆగస్టు 30 శాసనసభ న్యూస్:** తోటి స్నేహితులతో కలిసి ఆడుకుంటున్న క్రమంలో ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న నీటి సంపులో పడి ఓ బాలుడు మృతి చెందిన ఘటన గురువారం రాత్రి కొండమల్లేపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది.చుట్టు పక్కల వారు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లాకు చెందిన చాకలి వీరస్వామి-ఉమ దంపతులు బ్రతుకు తెరువుకై మూడేళ్ల క్రితం మండల కేంద్రానికి వచ్చి మేస్త్రీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఈశ్వర్ (6) ఉన్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి స్థానిక పాత ఊరులో గల ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో ఈశ్వర్ తోటి పిల్లలతో కలిసి ఆడుకుంటుండగా ఈఘటన చోటు చేసుకుంది. గమనించిన చిన్నారులు చుట్టు పక్కల వారికి తెలపడంతో వారు వెంటనే వచ్చి బాలుడిని సంపు నుంచి బయటికి తీశారు. చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రాంమూర్తి తెలిపారు.

## నూతన వదువరులను ఆశీర్వదించిన వడ్త్య రమేష్ నాయక్

**కొండమల్లేపల్లి, ఆగస్టు 30 శాసనసభ న్యూస్:** దేవరకొండ నియోజకవర్గం కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని కెఎం ఆర్ ఫంక్షన్ హాల్ లో శుక్రవారం జరిగిన వివాహ వేడుకలలో బిఆర్ఎస్ పార్టీ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ నాయక్ పాల్గొని నూతన వదువరులను ఆశీర్వదించారు. ఆయన వెంట బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# vగణేష్ ఉత్సవాలను శాంతి యుత వాతావరణంలో జరుపుకోవాలి





**రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్, ఆగస్టు 30 శాసనసభ న్యూస్ ప్రతినిధి:** శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనము సమావేశ మందిరంలో గణేష్ చతుర్థి ఉత్సవాల ఏర్పాట్ల పై డిసిపిలు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనరులు, పోలీస్ అధికారులు, గణేష్ ఉత్సవ సమితి, సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ తో కలిసి సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబర్ 7న వినాయకచవితి ఉత్సవాలు ప్రారంభమై 17న నిమజ్జనం చేయన్నునందున, వినాయక మండపాలు ఏర్పాటు చేసే భక్తులు, నిర్వాహకులు భక్తి శ్రద్ధలతో సురక్షిత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి మండపాల నిర్వాహకులు తగు జాగ్రత్తలు పాటించాలని అన్నారు.

జిల్లాలో గణేష్ నిమజ్జనం నిర్వహించేందుకు 44 చెరువులను గుర్తించినట్లు తెలిపారు. గణేష్ శోభా యాత్ర నిర్వహించే దారిలో గుంతలు పడిన రహదారులు, ప్యాచ్ వర్క్ రిపేర్ పనులు, గణేష్ నిమజ్జనం నిర్వహించే ప్రదేశాల వద్ద క్రెన్లు, బారికేడింగ్, వేదిక ఏర్పాట్లు మున్సిపల్, ఆర్ అండ్ బి శాఖ అధికారులు కలసి చేపట్టాలని, అధికారులు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా ప్రణాళిక రూపొందించుకొని సమన్వయముతో పని చేయాలని సూచించారు.

ముఖ్యంగా విద్యుత్ అంతరాయం కలగకుండా నిరంతరం విద్యుత్ సరఫరా కొనసాగించాలని, సమస్యలు ఎక్కువగా ఉన్నచోట భారీ బందోబస్తూ కల్పించాలని,సిసి కెమెరాలు ఏర్పాట్లు చేయాలని, భారీ కేడింగ్, బందోబస్త్, మెడికల్, సానిటేషన్, కంట్రోలింగ్ రూం తదితర ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. నంబరింగ్ ఇచ్చిన మండపాల దగ్గర పరిశుభ్రత పాటించాలని, మండపాల దగ్గర ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాలని,ఫాగింగ్, సానిటేషన్ పై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యుత్ కు సంబంధించి ఫోల్స్ అవసరమున్నచోట ఏర్పాటు చేయాలని, లోహ్యాంగింగ్ వైర్స్ ని సరిచేయాలని అన్నారు.

విగ్రహాలు ఊరేగింపు సమయంలో వాహనాల్లో ఎటువంటి యాంత్రిక సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని, నిమజ్జనం సమయంలో వేలాడే తీగలు, వంగి ఉన్న చెట్లు, తదితర వాటిని తొలిగించాలని తెలిపారు. చెరువుల వద్ద క్రేన్ లను ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చెరువుల వద్ద వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా మున్సిపల్ అధికారులు, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలి సూచించారు.

ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు ప్రతిమా సింగ్, మహేశ్వరం డిసిపి సునితా రెడ్డి, రాజేంద్రనగర్ డిసిపి శ్రీనివాస్, డిఆర్ ఓ సంగీత, ఆర్డీఓలు సూరజ్, సాయిరాం, అనంత రెడ్డి, మున్సిపల్ కమిషనరులు, పోలీస్ అధికారులు, ఆర్ అండ్ బి అధికారి, బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పట్నం శాస్త్ర గార్డెన్స్ లో గణేష్ మండప నిర్వహణదారులతో అధికారుల సమావేశం

నియోజకవర్గంలోని మున్సిపాలిటీలు, మండలాలకు,వివిధ శాఖలకు చెందిన అధికారులతో సమావేశం.

చెరువులు కుంటలను పరిశీలించిన అధికారులు

సమావేశానికి హాజరైన డిసిపి సునీత రెడ్డి.






**ఇబ్రహీంపట్నం ఆగస్టు 30 శాసనసభ న్యూస్ ప్రతినిధి:** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో గణేష్ నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభం కాబోతున్న సందర్భంగా డిసిపి సునీత రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కప్పరి స్రవంతి చందు, ఏసీపీ రాజు, మున్సిపల్ కమిషనర్ రవీందర్ సాగర్, ఎంపీడీవో, నాలుగు మండలాలకు సంబంధించిన సిఐలు, ఎస్సైలు,చెరువులను, చెక్ డ్యాములను సందర్శించారు. గణేష్ మండపాల నిర్వహణదారులతో శాస్త్ర గార్డెన్ లో మీటింగ్ ఏర్పాటు చేసి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చెరువులు, చిన్న చిన్న చెక్ డ్యాములు వద్ద ఏర్పాటు చేయాల్సిన, ప్రత్యేక క్రేన్లు, జెసిబి లు, లైట్స్, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా మున్సిపల్ చైర్ పర్సన్ కప్పరి స్రవంతి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గణేష్ నవరాత్రులు నిర్వహించే భక్తులకు ముందస్తు జాగ్రత్తలతో గణేష్ ఉత్సవాలను జరుపుకోవాలన్నారు. పోలీస్ డిపార్ట్మెంట్ సూచించిన తగు జాగ్రత్తలు, సూచనలకు అనుగుణంగా గణేష్ మండపాల నిర్వాహకులు తగు జాగ్రత్త తీసుకుంటూ భక్తి శ్రద్ధలతో గణేష్ నవరాత్రులు జరుపుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో పోలీస్ అధికారులు, గణేష్ మండప నిర్వాహకులు, స్థానిక మున్సిపల్ అధికారులు, పోలీసు లు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తహసిల్దార్ కు వినతి పత్రం



**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 30 శాసనసభ న్యూస్ ప్రతినిధి:** అమరవీరుల బలిదానాలతో తెలంగాణ ఉద్యమకారుల పోరాటాలు, త్యాగాలతో ఏర్పాటైన తెలంగాణ రాష్ట్రంలో గత 10 ఏండ్లు కెసిఆర్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను పూర్తిగా విస్మరించిందని, ఉద్యమ ఆకాంక్షలను తుంగలో తొక్కడం జరిగిందని, తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన తెలంగాణ తల్లి సోనియాగాంధీ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి ఉద్యమకారులకు 250 చ.గజములు ఇంటి స్థలాన్ని, పెన్షన్ సౌకర్యాన్ని కల్పిస్తామని 6 గ్యారంటీలలో హామీ ఇవ్వడమైనదని తెలంగాణ ఉద్యమకారుడు బోసు పల్లి వీరేష్ కుమార్ అన్నారు. తదనుగుణంగా తెలంగాణ ఉద్యమకారులు అందరూ ఉద్యమకారులను విస్మరించిన కె.సి.ఆర్ ని ఓడించి, ఉద్యమకారుల సంక్షేమం గురించి ఆలోచించిన కాంగ్రెస్ పార్టీ గెలుపులో ముఖ్యభూమికను పోషించడమైనది. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం విజ్ఞప్తి చేస్తున్నది. ఉద్యమానికి భూమిని అమ్ముకుని గత 20 సం.ల నుండి ఇల్లువాకిలి వదిలి, భార్యాపిల్లల్ని విడిచిపెట్టి ఉద్యమాలకే అంకితమైనామని బోసుపల్లి వినతిపత్రంలో తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులు చేసిన విజ్ఞప్తులు 250 చ.గజముల ఇంటి స్థలము హామీని వెంటనే నెరవేర్చాలి. ఉద్యమకారులను గుర్తించడానికి ఒక కమిటీని వేసి, గుర్తించి అందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలి. ఉద్యమకారులకు పెన్షన్ సౌకర్యం, ఉచిత బస్సు, ఆరోగ్య కార్డు కల్పించాలి. అమరవీరుల కుటుంబాలను, కవులు,కళాకారులను ఆదుకోవాలి. వినతిని అందించేవారిలో కొంత, యాదిరెడ్డి, బోసుపల్లి వీరేశ్ కుమర్ ,గజ్జి ఐలయ్య,ముది గొండ విజయ్, బర్తకి. రాజు,దరిశె శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఖర్చు అయిన డబ్బులలో సగం సీఎం రిలీఫ్ ఫండ్ నుండి అందజేయాలి



**మంచాల ఆగస్టు 30 శాసనసభ న్యూస్ ప్రతినిధి:** రోగులకు ప్రైవేటు ఆసుపత్రుల్లో అయిన వైద్య ఖర్చుల్లో సగం డబ్బులు సీఎం రిలీఫ్ ఫండ్ నుండి అందజేయాలనీ బండ లేమూర్ మాజీ సర్పంచ్ పోచమోని కృష్ణ కోరారు. బండ లేముర్ గ్రామానికి చెందిన ముడిగే మల్లయ్య,బూడిద యాదమ్మ, పార్వతి పారిజాత కుమారుడు బాను లు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందిన ఖర్చులు ముడిగే మల్లయ్య కు రు.60000 లు, పార్వతి బానుకు రు.13500 లు,బూడిద యాదమ్మ కు రు.7000 లు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సహకారంతో మంజూరు కావడం జరిగింది. ఈ చెక్కులు బాధితులకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ పొచమోని కృష్ణ మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వచ్చే డబ్బులు నిరుపేదల కు ఆర్థికంగా వెసలుబాటు ఇస్తుంది. ఆసుపత్రుల్లో అయిన వైద్య ఖర్చుల్లో సగం డబ్బులు సీఎం రిలీఫ్ ఫండ్ నుండి అందజేస్తే పేదలకు మరింత వెసలుబాటు ఇచ్చినట్లు అవుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బినమోని రాజు, బద్దుల మల్లేష్, వట్టి రాజు, వట్టి లింగం, పార్వతి శ్రీశైలం, పార్వతి ఎల్లయ్య, బద్దుల పాపయ్య తదతరులు పాల్గొన్నారు.

## అదనపు బస్సు పురమాయించాలని పట్నం డిపో ముందు ధర్నా



**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 30 శాసనసభ న్యూస్ ప్రతినిధి:** ఇబ్రహీంపట్నం డిపో ముందు బండలేమూర్ గ్రామ నాయకులు అదనపు బస్సు నడపాలని శుక్రవారం ధర్నా చేసి డిపో సిఐకి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఉదయం 8 గంటలకు అలాగే సాయంత్రం 4 గంటలకు ఖుదాబాక్స్ పల్లి బస్సు బండలేమూర్ మీదుగా వెళ్లాలని డిపో సిఐకి తెలియజేయడం జరిగింది. ఉదయం 7 గంటలకు వచ్చే బస్సులోనే తమ సిబ్బందిని పంపిస్తామని డిపో సిఐ చెప్పారని అన్నారు. కావున శనివారం ఉదయం 7 గంటలకు గ్రామ విద్యార్థులు అందరూ బస్ స్టాప్ దగ్గరకు రావాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజి బండలేమూర్ గ్రామ సర్పంచ్ మంగ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పోచమోని కృష్ణ, మాజీ వార్డు నెంబర్ జనార్దన్, మాజీ ఎంపీటీసీ వట్టి వెంకటేష్, మాజీ ఉపసర్పంచ్ కిషన్ నాయక్, యూత్ ప్రెసిడెంట్ విక్రం గౌడ్, మాజీ వార్డ్ నెంబర్ సుదర్శన్, జోగు రాజు, మాజీ ఉపసర్పంచ్ సంతోష సత్యం, జర్పుల కిషన్, జాఫర్ గూడెం సత్తయ్య, వట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.

# త్రాగు నీటి గొట్టంబావిని కాపాడి చుట్టూ కంచె ఏర్పాటు చేయాలి





**లికాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాధగోని జంగయ్య గౌడ్**

**మంచాల, ఆగస్టు 30 శాసనసభ న్యూస్ ప్రతినిధి:** మంచాల మండలం ఆరుట్ల గ్రామంలోని బండ లేమూర్ వెళ్లే దారిలో రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు కబ్జా చేసిన ఆరుట్ల గ్రామం మొత్తానికి త్రాగు నీరు అందించిన గొట్టం బావిని పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాధగోని జంగయ్య గౌడ్, వైయస్సార్ యువసేన మండల నాయకుడు లొంగరి యాదగిరి. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాధగోని జంగయ్య గౌడ్ మాట్లాడుతూ ఆరుట్ల గ్రామానికి త్రాగునీరు సరఫరా చేయడానికి ఆనాటి ప్రజాప్రతి నిధులు ప్రభుత్వంతో పోరాడి ఆరుట్ల గ్రామానికి తాగునీటి అవసరాల కోసం గొట్టం బావి తవ్వించి ఆరుట్ల గ్రామ ప్రజలకు త్రాగునీటి సమస్య లేకుండా చేయడం జరిగింది. దాదాపు త్రాగునీటి గొట్టంబావి నిర్మించి 30సంవత్సరాలు కావస్తుంది కాని ఈనాటి పాలకుల నిర్లక్ష్యం వల్ల గత 15 సంవత్సరాలుగా పాలకులు పట్టించుకోక పోవటంతో కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు గ్రామంలోని పెద్దలతో చేతులు కలిపి త్రాగునీటి బావి ప్రక్కన ఉన్న భూమిని కొనుగోలు చేసి గొట్టం బావి ఉన్న స్థలాన్ని కూడావదిలిపెట్టకుండా భూమి చుట్టూ కడీలు వేసి కబ్జా చేయడం జరిగింది చాలాసార్లు పెద్దలదృష్టికి అధికారులదృష్టికి గ్రామపంచాయతీ పాలకుల దృష్టికి తీసుకువెళ్లినా ఇప్పటివరకు త్రాగునీటి బావిని కాపాడే ప్రయత్నం చేయలేదు. త్రాగు నీటి బావి ప్రక్కన ఉన్న భూమిని రైతుల దగ్గర కొనుగోలు చేసి త్రాగు నీటి బావిని కూడా కబ్జా చేసి చుట్టూ కడీలు వేయించిన రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు. ఈరోజు గ్రామంలో నాయకులుగా చలామణి అవుతూ గ్రామంలో ఎక్కడ అక్రమాలు కబ్జాలు జరిగినా చూసిచూడనట్టుగా ఉంటున్నారు. గత కొన్ని రోజులుగా ఆరుట్లగ్రామంలో త్రాగునీటిసమస్య ఉన్నవిషయం గ్రామంలోని ప్రతినాయకుడికి తెలుసు అయిన ఏ నాయకుడైన ప్రజల త్రాగునీటి సమస్య తీర్చ టానికి ఆలోచన చేయటం లేదన్నారు. ఆనాటి నాయకులు ఆరుట్ల గ్రామప్రజల దాహంతీర్చటానికి ప్రభుత్వంతో పోరాడి మూరు సోల కుంటలో స్థలం గుర్తించి గొట్టం బావి నిర్మించి గ్రామప్రజలకు త్రాగునీరుఅందిస్తే ఈనాటి నాయకులు పాలకులు రియల్ ఎస్టేట్ పారస్తులతో చేతులు కలిపి త్రాగునీటిబావి కబ్జాకుగురిఅయినా పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి కబ్జాకు గురైన త్రాగునీటి గొట్టం బావిని కాపాడి చుట్టూ కంచె వేసి ఆరుట్ల గ్రామ ప్రజలకు బావి నుండి నీటి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. అధికార పార్టీ కాంగ్రెస్ నాయకులమైన మేము ప్రజా సమస్యలు అధికారుల దృష్టి కి తీసుకు పోవడమే మా లక్ష్యం ప్రజల కోసమే పని చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో వైయస్సార్ యువసేన మండల నాయకుడు లొంగరి యాదగిరి పాల్గొన్నారు.

## సభ్యత్వ నమోదుపై బిజెపి కార్యాలయంలో సమావేశం

**బిజెపి మండల అధ్యక్షుడు శివర్ల రమేష్ యాదవ్**




**చింతపల్లి, అగస్టు 30 శాసనసభ న్యూస్ ప్రతినిధి:** భారతీయ జనతా పార్టీ చింతపల్లి మండల సభ్యత్వ నమోదు వర్క్ షాప్ బిజెపి మండల కార్యాలయంలో మండల అధ్యక్షులు శివర్ల రమేష్ యాదవ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కర్నాటి సురేశ్ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 1వ తేదీ నుండి దేశవ్యాప్తంగా జరిగే భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు అంతా కష్టపడి పని చేసి ప్రతి బూతులో కనీసం 200 మందిని సభ్యులుగా చేర్పించాలని అన్నారు. రాబోయే రోజుల్లో గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం కోసం ప్రతి బూతు, ప్రతి గ్రామంలో అన్ని వర్గాల ప్రజలను సభ్యులుగా నమోదు చేయాలని అన్నారు.ఈ సమావేశంలో.బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు గోపిడి అనిల్, ఓబీసీ సెల్ జిల్లా కార్యదర్శి వెన్నం శేఖర్ ,మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు మహేష్ గౌడ్,మండల ఉపాధ్యక్షులు క్రాంతి రెడ్డి, గంగల వెంకటయ్య, బీజేవైఎం మండల అధ్యక్షులు కుందేళ్ళ శ్రీశైలం యాదవ్, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి గజ్జె అభినవ్ గౌడ్,అంజి,పాలకుర్ల రాజు,గడ్డి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్త సారధులు ఎవరు...



**హైదరాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుల నియామకంలో ఆయా పార్టీ అధిష్టానాలు దోబూచులాడుతున్నట్లు కనిపిస్తోంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి నియామకం తర్వాతే కలమదళం సారథిపై నిర్ణయం తీసుకోవాలని భావిస్తుండగా.. బీజేపీ, బీఆర్ఎస్ పొలిటికల్ స్టెప్స్ పరిశీలించి? ఆ పార్టీల యాక్టవిటీస్‌పై ఓ అంచనాకు వచ్చాకే పీసీసీ బాస్ ఎవరన్నది తేల్చాలని కాంగ్రెస్ తాజాగా నిర్ణయించినట్లు తెలుస్తోంది. శుక్రవారం ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో ఏఐసీసీ పెద్దలు భేటీ అయిత తర్వాత ఒకటి రెండు రోజుల్లో పీసీసీ చీఫ్‌పై తేల్చేస్తామని చెప్పినా? మరో ఏడాదిపాటు సీఎం రేవంత్‌రెడ్డినే పీసీసీ అధ్యక్షుడిగా కొనసాగించి.. ఆ తర్వాత కొత్త వారిని నియమిస్తే ఎలా ఉంటుందనే ప్రతిపాదన పరిశీలిస్తున్నట్లు తాజాగా టాక్ వినిపిస్తోంది.ప్రస్తుతం పీసీసీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి పదవీ కాలం నెల రోజుల క్రితమే పూర్తయింది. ఆయన స్థానంలో కొత్తవారిని నియమించాలని ఏఐసీసీ పలువురి పేర్లను పరిశీలిస్తోంది. ఐతే మంత్రివర్గం విస్తరణ, పీసీసీ నూతన కార్యవర్గం ఎంపిక ఒకదానికొకటి లింక్ ఉండటంతో ఎటూ తేల్చుకోలేకపోతోంది. ఇదే సమయంలో కాంగ్రెస్ అధ్యక్షుడిని నియమించిన తర్వాతే బీజేపీ సారథిని ఎంపిక చేయాలనే ఆలోచనతో కమలనాథులు ఉన్నట్లు తెలుసుకున్న కాంగ్రెస్ హైకమాండ్ మరికొన్నాళ్లు వేచిచూస్తే ఎలా ఉంటుందనే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. మరో ఏడాదైనా రేవంత్‌రెడ్డిని కొనసాగిస్తే? అప్పటికి అసెంబ్లీ ఎన్నికలకు మూడేళ్లు సమయం ఉంటుందని? కొత్త సారథికి ఎన్నికల బాధ్యతలు అప్పగిస్తే యాక్టివ్‌గా పనిచేస్తారని భావిస్తోందట ఏఐసీసీ? దీంతోనే పీసీసీ చీఫ్ నియామకాన్ని వాయిదా వేయాలని నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది.వాస్తవానికి కాంగ్రెస్‌తోపాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని నియమించాల్సివుంది. రెండు పార్టీల్లోనూ అధ్యక్షులుగా వ్యవహరిస్తున్న ఇద్దరు నేతలు ఒకరు సీఎంగా మరొకరు కేంద్ర మంత్రిగా అధికార విధుల్లో బిజీగా ఉంటున్నారు. దీంతో పార్టీ కార్యక్రమాలు వెనకబడుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇదే సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి? వారి వారి పార్టీ బాధ్యతల నుంచి తప్పుకోవాలని చూస్తున్నారు. కానీ, రెండు పార్టీల అధిష్టాన వర్గాలు మాత్రం ఇద్దరికి విముక్తి కల్పించడం లేదు.పీసీసీ కొత్త సారథులుగా బీసీ వర్గం నుంచి మహేశ్‌కుమార్ గౌడ్, మధు యాష్కీ పేర్లు పరిశీలనలో ఉండగా, ఎస్టీ కోటాలో బలరాం నాయక్, ఎస్సీ కోటాలో సంపత్‌కుమార్ పేర్లు వినిపిస్తున్నాయి. ఇక రాష్ట్రంలో కీలక సామాజిక వర్గాలైన రెడ్డి, వెలమ కులాలకు చెందిన నేతలు కూడా పీసీసీ చీఫ్ పీఠాన్ని ఆశిస్తున్నా సామాజిక సమీకరణల రీత్యా వారికి చాన్స్ లేదంటున్నారు. ఇదే సమయంలో బీజేపీ కూడా కాంగ్రెస్ ఎంపిక తర్వాతే తాను నిర్ణయం తీసుకోవాలని భావిస్తోందంటున్నారు. ఐతే బీజేపీలో బీసీలకు తప్ప వేరొకరికి రాష్ట్ర అధ్యక్ష పదవి ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో కాంగ్రెస్ నిర్ణయం కోసం వేచి చూడకుండా కొత్త అధ్యక్షుడిపై ప్రకటన చేయాలని బీజేపీ కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారుమొత్తానికి రెండు జాతీయ పార్టీలు కొత్త అధ్యక్షుడిని నియమించే విషయంలో ఒకరి నిర్ణయం కోసం ఒకరు వేచిచూడటమే తెలంగాణలో పొలిటికల్‌గా హాట్‌టాపిక్ అవుతోంది. ఒక పార్టీ రాష్ట్రంలో.. మరోపార్టీ కేంద్రంలో అధికారంలో ఉండగా, రాష్ట్ర అధ్యక్షులుగా ఎవరిని నియమించాలనే అంశం ఇరుపార్టీలకు సవాల్‌గా మారిందంటున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్‌లో పీసీసీ, మంత్రి పదవుల మధ్య లింక్‌తో ఎటూ తేల్చుకోలేకపోతుండగా, బీజేపీ మాత్రం సమర్థులైన నేతల కోసం అన్వేషిస్తుండటం వల్లే జాప్యం జరుగుతోందంటున్నారు. అందుకే కాంగ్రెస్ సారథి నియామకంపై లింక్ పెడితే కొన్నాళ్లు సమయం లభిస్తుందని బీజేపీ పెద్దలు భావిస్తున్నారంటున్నారు. ఇలా రెండు పార్టీలు తెలంగాణ సారథులపై తేల్చుకోలేకే వాయిదాలపై వాయిదాలు వేస్తున్నట్లు చెబుతున్నారు.

# కాంగ్రెస్, లెఫ్ట్. దూరం... దూరం



**హైదరాబాద్ :** తెలంగాణలో లెఫ్ట్ పార్టీలు,కాంగ్రెస్ మధ్య ఏదో జరుగుతోందన్న చర్చ ఇప్పుడు కీలకంగా మారంది. అధికారంలోకి వచ్చిన కొత్తలో.. అంతా సవ్యంగానే నడించింది కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీల మధ్య. అసెంబ్లీలో సీపీఐ సభ్యుడు కూనంనేని కూడా అధికారపక్షంతోనే ఆశీనులవుతూ.. అంశాలవారీగా ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూ వస్తున్నారు. ఇటీవల రాఘవులు, జూలకంటి రంగారెడ్డి సహా పలువురు నేతలు సైతం సీఎం రేవంత్‌తో ములాఖత్ కావడంతో? సీపీఎం కూడా కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉంటుందన్న సంకేతాలు ఇచ్చారు. అయితే కొన్నాళ్లుగా లెఫ్ట్‌పార్టీలకు, కాంగ్రెస్‌కు మధ్య .. వ్యవహారం చెడినట్టుగా అనిపిస్తోంది. ఎర్ర పార్టీల తీరు, ఆ నేతల వ్యాఖ్యలు చూస్తుంటే? అది నిజమే కావొచ్చన్న చర్చ పొలిటికల్‌గా రచ్చరేపుతోంది.రుణమాఫీ సహా హామీల అమలు వరకు?. హైడ్రా హడావుడి నుంచి కవిత్ బెయిల్ దాకా? ఇలా అంశమేదైనా, కాంగ్రెస్‌నేతలకు పూర్తి భిన్నమైన స్వరంతో ఎర్రనేతలు వ్యాఖ్యలు చేస్తుండటం ఆసక్తిరేపుతోంది. నిన్నమొన్నటి దాకా.. ప్రభుత్వం బాగానే పనిచేస్తుందంటూ కితాబు ఇచ్చిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు.. తాజాగా కొన్నాళ్ల నుంచి చేస్తున్న వ్యాఖ్యలు.. ఎక్కడో తేడా కొడుతోందన్నట్టుగా అనిపిస్తున్నాయి. ప్రధానంగా రుణమాఫీ విషయంలో ప్రభుత్వపెద్దలు చెబుతున్న వ్యాఖ్యలు ఒకలా ఉంటే.. మిత్రపక్షంగా వాటిని సమర్థించాల్సిన సీపీఐ.. మరోవిధంగా స్పందిస్తుండటం రాజకీయంగా ఏదో శకునాన్ని సూచిస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రుణమాఫీ జరిగిపోయిందనీ? రైతులకు ఇప్పటివరకు ఈస్థాయిలో మేలు చేసింది తమ ప్రభుత్వమేనని? కాంగ్రెస్ పెద్దలు చెబుతున్నారు.రుణమాఫీ అంశంలో.. ప్రతిపక్షంగా బీఆర్ఎస్ యుద్ధం చేయడం కామన్. కానీ, మిత్రపక్షంగా ఉన్న సీపీఐ కూడా? అదే తరహా వ్యాఖ్యలు చేస్తుండటం ఆసక్తి రేపుతోంది. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా రుణమాఫీ పూర్తిచేసి తీరాల్సిందేనంటున్న ఎమ్మెల్యే కూనంనేని? రైతులకు కండీషన్లు పెట్టడం కరెక్ట్ కాదంటున్నారు. ఇచ్చిన మాట ప్రకారం ముందుకు వెళ్లకపోతే? ప్రభుత్వానికే నష్టమంటూ హెచ్చరిస్తున్నారు. ఇదే రుణమాఫీ విషయంలో? ఇటీవల ఖమ్మంలో మంత్రి తుమ్మలను సీపీఐ శ్రేణులు అడ్డుకోవడం కూడా రాజకీయంగా చర్చనీయాంశమైంది. మంత్రి తుమ్మల సర్దిచెప్పుకోవాల్సి వచ్చిందంటే.. పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.అయితే, ప్రభుత్వంలో మిత్రపక్షంగా ఉన్న పార్టీ? ఇలా సడెన్‌గా ప్లేటు ఫిరాయించడం.. కాంగ్రెస్ శ్రేణులను సైతం విస్మయపరుస్తోంది. ఎందుకంటే, ఒక్క రుణమాఫీ విషయంలోనే కాదు.. హామీల అమలుపైనా ఎర్రన్నలు ఇలాంటి కామెంట్సే చేస్తున్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ప్రభుత్వంలో కాదు.. ప్రజల పక్షాన ఉంటామంటూ ఇప్పటికే పలుమార్లు ఎమ్మెల్యే కూనంనేని.. ఫ్యూచర్‌పై ఒక క్లూ వదిలారు. తాజాగా, బీఆర్ఎస్ఎమ్మెల్సీ కవిత బెయిల్ అంశంలోనూ హస్తం నేతలపై పరోక్షంగా కూనంనేని ఘాటుగా వ్యాఖ్యలు చేయడం ఆసక్తి రేపుతోంది. ప్రభుత్వం తీసుకొచ్చిన హైడ్రా విషయంలోనూ సీపీఐ.. స్పష్టత కోరుతోంది. పేదలు, మధ్య తరగతి ప్రజల జోలికి వెళ్తే ఊరుకునేది లేదంటూ హెచ్చరిస్తోంది. అలా కూల్చాల్సి వస్తే.. వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తోంది.మొత్తానికి, సిట్యుయేషన్ చూస్తుంటే? హస్తంతో ఎర్రన్నల బంధానికి బీటలుపడుతున్నట్టుందనే చర్చ.. రాజకీయవర్గాల్లో మొదలైంది. చెడిందా? లేక చెడబోతోందా? అనే డిస్కషన్ ఇప్పుడు తెలంగాణ పొలిటికల్ కారిడార్‌లో జోరుగా జరుగుతోంది. అది నిజమో కాదో తెలియాలంటే.. ఇంకొన్నాళ్లు ఆగాలేమో..!

# జహీరాబాద్ కు మహర్దశ

**మెదక్ :** తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధి దిశగా కేంద్రప్రభుత్వం మరో మెగా ప్రాజెక్టును రాష్ట్రానికి కేటాయించింది. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీని ఏర్పాటుచేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. బుధవారం ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఆర్థిక వ్యవహారాల కేంద్ర కేబినెట్ భేటీ జరిగింది. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా.. రూ.28,602 కోట్లతో దేశవ్యాప్తంగా 12 పారిశ్రామిక స్మార్ట్ సిటీలను ఏర్పాటుచేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.ఈ కార్యక్రమంలో భాగంగా.. రూ.2,361 కోట్లతో ఒక ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీని తెలంగాణలోని జహీరాబాద్‌లో ఏర్పాటుచేస్తున్నట్లు కేంద్రం స్పష్టంచేసింది. తెలంగాణ-కర్ణాటక రాష్ట్రాల సరిహద్దుల్లో ఏర్పాటయ్యే ఈ ప్రాజెక్టు ద్వారా తెలంగాణతోపాటు కర్ణాటకలోనూ పారిశ్రామికాభివృద్ధి మరింత వేగంగా ముందడుగు వేయనుంది.హైదరాబాద్-నాగ్‌పూర్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా.. సంగారెడ్డి జిల్లాలోని న్యాలకల్, జరాసంగం మండలాల్లోని 17 గ్రామాల్లో జహీరాబాద్ పారిశ్రామిక ప్రాంతం కేంద్రంగా ఈ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ నిర్మాణం జరగనుంది. మొత్తం రెండు దశల్లో, దాదాపు 12,500 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టు విస్తరించనుంది. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్, ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్ ఫ్రేమ్‌వర్క్‌లో భాగంగా.. 3,245 ఎకరాల్లో మొదటి దశలో పనులు ప్రారంభం అవుతాయి.ఈ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ.. పూణే-మచిలీపట్నం జాతీయ రహదారికి 2 కిలోమీటర్ల దూరంలో ఉంది. దీంతోపాటుగా నిజాంపేట్-బీదర్ రాష్ట్ర రహదారి , జహీరాబాద్-బీదర్ రాష్ట్ర రహదారిసమీపంలోనే ఉన్నాయి. హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్డుకు 65 కిలోమీటర్లు, ప్రతిపాదిత రీజనల్ రింగ్ రోడ్డుకు 10 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రాజెక్టు నిర్మాణం జరగనుంది.ఈ ప్రాంతం.. జహీరాబాద్ రైల్వేస్టేషన్ కు 19 కిలోమీటర్లు, మెటల్‌కుంట రైల్వేస్టేషన్ కు 12 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడి నుంచి హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం 125 కిలోమీటర్ల దూరంలో.. ముంబయిలోని జవహార్‌లాల్ నెహ్రూ పోర్ట్ ట్రస్ట్ 600 కిలోమీటర్ల దూరంలో, ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణపట్నం పోర్టు 620 కిలోమీటర్ల దూరంలో ఉంది. కీలకమైన గ్యాస్ ట్యాప్ ఆఫ్ పాయింట్ (పెట్రోలియం ఉత్పత్తుల మైన్ పైప్‌లైన్) కూడా జహీరాబాద్-బీదర్ మధ్యలో.. ప్రతిపాదిత ప్రాజెక్టుకు 30 కిలోమీటర్ల దూరంలో ఉంది.జహీరాబాద్‌లో నిర్మించనున్న ఈ ఇండస్ట్రియల్ ప్రాజెక్ట్ మొదటి దశకు అవసరమైన 3,245 ఎకరాల స్థలానికి సంబంధించి.. 3,100 (దాదాపు 80%) భూమి రాష్ట్ర ప్రభుత్వం వద్దే ఉంది. రాష్ట్రానికి సంబంధించి.. షేర్ హోల్డర్స్ అగ్రిమెంట్ , స్టేట్ సపోర్ట్ అగ్రిమెంట్ ఇప్పటికే పూర్తయ్యాయి. దీంతోపాటుగా ఈ ఇండస్ట్రి యల్ స్మార్ట్ సిటీ ద్వారా.. లక్షా 74వేల మందికి ఉపాధి లభించడంతోపాటుగా.. దాదాపు రూ.10వేల కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా. దీనికి సంబంధించిన పర్యావరణ అనుమతులన్నీ అటవీ పర్యావరణ శాఖ నుంచి అందాయి. దేశవ్యాప్తంగా 6 ప్రధాన పారిశ్రామిక కారిడార్ల పరిధిలోని.. 10 రాష్ట్రాల్లో (ఉత్తరాఖండ్, పంజాబ్, హరియా ణా, మహారాష్ట్ర, కేరళ, ఉత్తరప్రదేశ్, బిహార్, ఆంధ్రప్రదేశ్ (ఓర్వకల్లు, కొప్పర్తి), తెలంగాణ (జహీరాబాద్), రాజస్థాన్) ఈ 12 ఇండస్ట్రియల్ సిటీలు రానున్నాయి.తెలంగాణలోని జహీరాబాద్‌కు ఈ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీని కేటాయించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ , పరిశ్రమల మంత్రి పీయుష్ గోయల్ .. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

## లిమ్స్ ఆసుపత్రిలో దారుణం

**ఓ పాజిటివ్ రక్తానికి కి బదులుగా ఏబీ పాజిటివ్ రక్తం ఎక్కించిన వైద్యులు**

**రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ప్రైవేట్ ఆసుపత్రి నిర్వాకం**

**ప్రాణాపాయ స్థితిలో 23 ఏళ్ల మహిళ**

**రంగారెడ్డి :** ఇబ్రహీంపట్నం: ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యులు చేసిన నిర్వకానికి ఓ మహిళ ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం నోముల గ్రామానికి చెందిన ఐతరాజు మేఘన అలియాస్ శోభ(23) అనారోగ్యంతో ఆగస్టు 16న లిమ్స్ ఆసుపత్రిలో చేరింది. ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు రక్తం ఎక్కించాలని తెలిపి ఆమెకు రక్తం ఎక్కించారు. ఆ తర్వాత 17 వ తేది ఆరోగ్యం మెరుగైందని డిశ్చార్జ్ చేశారు. ఇంటికి వెళ్లిన తర్వాత 23వ తేదీన మరల ఆరోగ్యం క్షిణించడం తో హుటాహుటిన ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యపరీక్షలు నిర్వహించిన వైద్యులు రక్తం ఇన్ఫెక్షన్ అయినట్లు పేర్కొన్నారు. ఎందుకు అలా జరిగిందని ఆరా తీయడంతో ఇబ్రహీంపట్నం లిమ్స్ ఆసుపత్రి వారు రోగిది ఓ పాజిటివ్ రక్తం కాగా ఆమెకు ఏబీ పాజిటివ్ రక్తాన్ని ఎక్కించినట్లు తేలింది. ప్రస్తుతం బాధితురాలు ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ విషయమై బాధితురాలి భర్త ఆసుపత్రి పై ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. తమకు న్యాయం చేయాలని, ఆసుపత్రి స్టాఫ్ నిర్వకంపై కఠిన చర్యలు తీసుకోవాలని అందులో డిమాండ్ చేశాడు

## అనుమతుల్లేని ఆసుపత్రి సీజ్

**కూకట్ పల్లి :** అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఓ ఆసుపత్రికి జిల్లా వైద్యాధికారి సీజ్ చేసిన ఘటన కూకట్పల్లి కె.పి.హెచ్.బి కాలనీలో చోటు చేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం కె.పి.హెచ్.బి కాలనీ 5వ ఫేజులో అనుమతులు లేకుండా డాక్టర్ సుగుణాస్ ప్రీమియర్ డెర్మటాలజీ క్లినిక్ ను అనే ఆసుపత్రికి నిర్వహిస్తున్నారు. పక్కా సమాచారం మేరకు ఈ రోజు సాయంత్రం అధికారులు క్లినిక్ లో తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రి నిర్వహణకు ఉపయోగించిన అనుమతి పత్రం, నకిలీ పత్రంగా గుర్తించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ రఘునాథ్ స్వామి మాట్లాడుతూ గత 11 నెలలుగా ఈ క్లినిక్ లో ఎటువంటి అనుమతులు లేకుండా ట్రీట్మెంట్ నిర్వహిస్తున్నారని డిఎంహెచ్వో వెల్లడించారు. సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు గురించి ఆరా తీస్తుంటే ఫేక్ డాక్యుమెంట్ ని చూపిస్తున్నారని దీనితో ఈ క్లినిక్ ను సీజ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ క్లినిక్ నిర్వహణకై తమకు ఎటువంటి అప్లికేషన్ రాలేదనేది పూర్తిగా వెరిఫై చేసిన తర్వాతే సీజ్ చేయడం జరిగిందని, ఆసుపత్రి నిర్వాహకులు పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు.

## ‘హస్త’గతమయిన పీర్జాదిగూడ మునిసిపాలిటీ

**మేడ్చల్ :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ నియోజకవర్గం లో స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తో పాటు బిఆర్ఎస్ పార్టీ కి మరో బిగ్ షాక్ తగిలింది. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ పై నేటి నుండి కాంగ్రెస్ జండా ఎగరనుంది. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ లో మొత్తం ఇరవై ఆరు మంది కార్పోరేటర్లు ఉండగా , బిఆర్ఎస్ మేయర్ జక్కా వెంకటరెడ్డి పై ఇరవై ఒక్క కార్పోరేటర్లు అవిశ్వాసం ప్రకటించారు. మేడ్చల్ జిల్లా కలెక్టర్ కు ఇచ్చిన నోటీసు మేరకు ఈనెల తొమ్మిదిన పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయం లో మేయర్ జక్కా వెంకటరెడ్డి పై అవిశ్వాసం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో మేయర్ జక్కా వెంకటరెడ్డి పదవీచ్యుతులు అయ్యారు. అదే రోజు మెజారిటీ కార్పోరేటర్లు తమ నూతన మేయర్ అభ్యర్థిగా పన్నెండవ డివిజన్ కాంగ్రెస్ కార్పోరేటర్ అమర్ సింగ్ ను మేయర్ గా ఎన్నుకున్నారు. దీంతో అమర్ సింగ్ నూతన మేయర్ గా శుక్రవారం పదవీబాధ్యతలు స్వీకరించారు.

## బోయినీ చెరువును సందర్శించిన మేయర్

**సికింద్రాబాద్ :** ఓల్డ్ బోయిన్ పల్లి హరిజన బస్తీ వాసుల నోటీసుల గురించి ప్రభుత్వంతో మాట్లాడుతానని నగర మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి బస్తీ వాసులకు మాట్లాడుతానని హామీనిచ్చారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా గణేష్ నిమజ్జనం, ఏర్పాట్ల పరిశీలన కోసం మేయర్ హస్మాత్ పేట్ బోయిన్ చెరువును అధికారులతో కలసి సందర్శించారు. ఈ సందర్బంగా నగర మేయర్ గద్వాల్ విజయ లక్ష్మికి ఓల్డ్ బోయిన్ పల్లి హరిజన బస్తీ వాసులు కార్పొరేటర్ ముద్దం నరసిహ్మ యాదవ్ ఆద్వర్యంలో కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. నగర మేయర్ గా ఇక్కడి ప్రజల అవస్థలు తనకు తెలుసునని తప్పకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతానని హామీ నిచ్చారు. అనంతరం కార్పొరేటర్ ముద్ధం హరిజన బస్తీ వాసులకు అండగా ఉంటానని చెప్పారు. ఇళ్ల రక్షణ కోసం హైడ్రాతో పోరాటం చేస్తానని, అవసరమైతే ఈ భస్తిలోనే నిద్రిస్తానని వారికి భరోసా కల్పించారు..

## ఖైరతాబాద్ గణేష్ విగ్రహ ప్రతిష్టాపనకు ఏర్పాట్లు




**హైదరాబాద్ :** ప్రపంచ ఖ్యాతి పొందిన ఖైరతాబాద్ బడా గణేష్ ప్రతిష్టాపన అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. లక్షలాది మంది భక్తులు ఖైరతాబాద్ బడా గణనాథుడిని దర్శించుకుంటారని... వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉత్సవ కమిటీ చర్యలు చేపడుతుందన్నారు. భారతదేశ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో ఈ ఏడాది గణేష్ నిమజ్జన శోభాయాత్ర ఉండబోతుందని తెలిపారు. హిమాయత్ నగర్ డివిజన్ లోని అవంతి నగర్ , ముత్యాలమ్మ బస్తీ లో 1 కోటి 60 లక్షల అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో జంట నగరాలలో ఉన్న గణేష్ మండపాలకు ఉచిత కరెంట్ అందజేస్తున్నట్లు దానం తెలిపారు. నిర్వాహకులు ముందస్తుగా అధికారులను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే సెప్టెంబర్ 17 గణేష్ నిమజ్జనంతో పాటు మిలాద్ ఉన్ నబీ ఒకే రోజు వస్తున్నాయని అన్నారు. ఈ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు... ముస్లిం మత పెద్దలు మిలాద్ ఉన్ నబీ ను 19 న నిర్వహిస్తామని తెలపడం పట్ల ఆయన ధన్యవాదాలు తెలిపారు.


## ఖజానా నింపుతున్న రిజిస్ట్రేషన్ల శాఖ

**హైదరాబాద్ :** తెలంగాణలో రాష్ట్ర ఖజానా నిండుతోంది. రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ల ఆదాయం పదేళ్ళలో ఏడింతలు పెరిగింది. అదే సమయంలో రిజిస్ట్రేషన్ అవుతున్న డాక్యుమెంట్లు రెండింతలకు పైగా పెరిగాయని గణాంకాలు చెబుతున్నాయి. 2014?15లో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల ఆదాయం రూ.2,746 కోట్లు ఉంటే.. 2023?24కు వచ్చేసరికి రూ.14,588 కోట్లకు చేరింది. ఒక్క కరోనా ఏడాదిలో తప్ప మిగిలిన ప్రతి ఏడాది ఆదాయంలో వృద్ధి కనిపించింది. అదే డాక్యుమెంట్ల విషయానికొస్తే అప్పుడు 8.27 లక్షలు రిజిస్ట్రేషన్ కాగా.. గతేడాదికి ఆ మొత్తం 18.41 లక్షలకు చేరాయి.స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ డిపార్ట్‌మెంట్ వార్షిక నివేదికను తాజాగా రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. దీని ప్రకారం పోయిన ఏడాది ఎన్నికల సంవత్సరం కావడంతో అంతకు ముందు సంవత్సరం (2022?23)తో చూస్తే అగ్రికల్చర్ డాక్యుమెంట్లు లక్ష మేర తగ్గాయి. అదే నాన్ అగ్రికల్చర్ విషయానికొస్తే పెద్దగా మార్పు లేదు. గత సంవత్సరం నాన్ అగ్రికల్చర్ పరిధిలోని ఓపెన్ ప్లాట్లపై జనాలు ఎక్కువ అమ్మకాలు, కొనుగోళ్లు చేశారని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. మొత్తంగా 10.50 లక్షల సేల్ డీడ్స్ జరిగితే అందులో 3.91 లక్షలు ఓపెన్ ప్లాట్ల ద్వారా క్రయవిక్రయాలు జరిగాయి. ఇందులో 1.03 లక్షలు ఇండ్లకు, ఫ్లాట్లకు 94,884, ఇక అగ్రికల్చర్లో 4.60 లక్షల సేల్ డీడ్స్ చేసుకున్నట్లు నివేదికలో పేర్కొన్నారు. ఎక్కువగా ఆదాయం తెచ్చిపెడుతున్న జిల్లాల్లో రంగారెడ్డి టాప్ ప్లేస్‌లో ఉంది.

# దేవర హైప్.. సరిపోదా?




సరిపోదా శనివారం సినిమా రిలీజ్ తో ఆగస్టు నెల పూర్తయింది. సెప్టెంబరు నెలలో దేవర ఒక్కటే పెద్ద సినిమా మిగతా చిన్నాచితకా సినిమాలు ఉన్నాయి కానీ దేవర మీదే అందరి ఫోకస్ ఉంది. ఇప్పటికే రిలీజ్ కావాల్సిన ఈ సినిమా వాయిదా పడి సెప్టెంబర్ 27వ తేదీకి వెళ్ళింది. అయితే ఈ సినిమా హైప్ అనేది ఇప్పుడు చర్చనీయాంశమైంది. నిజానికి కొరటాల శివ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా దేవర అనే సినిమా అనౌన్స్ చేశారు. కొరటాల ఆచారి లాంటి డిజాస్టర్ అందించి ఉండడం, జూనియర్ ఎన్టీఆర్ ఆర్ఆర్ఆర్ తర్వాత చేస్తున్న సినిమా కావడంతో ఈ సినిమా మీద సహజంగానే అందరి ఆసక్తి ఉంది. దానికి తగ్గట్టుగానే హీరోయిన్గా అతిలోకసుందరి అని తెలుగు వారంతా భావించే జాన్వీ కపూర్ ను దించడం, ఎన్టీఆర్ ద్విపాత్రాభినయం అని చెప్పడం విలన్ గా, సైఫ్ అలీ ఖాన్ ను దింపడం లాంటివి సినిమా మీద ఉన్న ఆసక్తిని అమాంతంగా పెంచేశాయి. దానికి తగ్గట్టుగానే సినిమా నుంచి విడుదలైన రెండు పాటలు ఒక రేంజ్ లో ప్రేక్షకులకు ఎక్కేశాయి. మూడో పాట కోసం ఇప్పుడు కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. దానికి తగ్గట్టుగానే లిరిక్ రైటర్ రామజోగయ్య శాస్త్రి తనవంతుగా తాను హైప్ ఎక్కించే ప్రయత్నం చేస్తున్నాడు. మరొకపక్క మీడియాకి, సోషల్ మీడియా కి లీకులు ఇస్తూ సినిమా యూనిట్ కూడా సినిమా మీద హైప్ ఎక్కించే ప్రయత్నం చేస్తోంది. అయితే ఈ హైప్ ఎంతవరకు ఉపయోగపడు తుంది? అనేది ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఎందుకంటే పెద్దగా హైప్ లేకుండా వచ్చిన సరిపోదా శనివారం సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంది. కొంత నెగిటివ్ టాక్ ఉన్నా సింహభాగం పాజిటివ్ టాక్ తో హిట్ ట్యాగ్ వేసుకొని దూసుకుపోతోంది. ఈ విషయంలో దర్శక నిర్మాతలు ఒక తెలివైన పని చేశారు.




## కంగనారనౌత్ ఎమర్జెన్సీ విడుదలపై నిషేధం?

బాలీవుడ్ నటి కంగనారనౌత్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ప్రాజెక్ట్ ఎమర్జెన్సీ. దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పాలనలో 1975 జూన్ 25 నుండి 1977 వరకు కొనసాగిన ఇండియన్ ఎమర్జెన్సీ ఆధారంగా తెరకెక్కిస్తున్నారు. పొలిటికల్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రంలో కంగనారనౌత్ ఇందిరాగాంధీ పాత్రలో నటిస్తోంది. ఇప్పటికే ప్రేక్షకుల ముందుకు రావాల్సిన ఈ చిత్రాన్ని ఎన్నికలకు ముందు వివాదాలకు అవకాశం ఇవ్వకుండా.. సెప్టెంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు మేకర్స్. విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో తెలంగాణలో నిషేధం విధించే అవకాశాలున్నాయన్న వార్తలు తెరపైకి వస్తున్నాయి. ఎమర్జెన్సీ సినిమా రిలీజ్పై ప్రభుత్వం న్యాయపరమైన సంప్రదింపులు జరుపుతూ.. నిషేధం అంశాన్ని పరిలిస్తుందని ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ తెలిపారు. మాజీ ఐపీఎస్ అధికారి తేజ్ దీప్ కౌర్ మీనన్ నేతృత్వంలోని తెలంగాణ సిక్కు సొసైటీ ప్రతినిధుల బృందం షబ్బీర్ను కలిసి ఎమర్జెన్సీ విడుదలపై నిషేధం విధించాలని కోరింది. సిక్కు సొసైటీ ప్రతినిధులు సినిమాలో సిక్కు సమాజాన్ని చూపించిన తీరు పట్ల ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో.. రాష్ట్రంలో సినిమాను నిషేధించే అంశాన్ని పరిశీలించాలని సీఎం రేవంత్ రెడ్డిని షబ్బీర్ కోరినట్టు సమాచారం. ఎమర్జెన్సీ సమయంలో పౌరహక్కుల సస్పెన్షన్, ఇందిరా గాంధీ వ్యతిరేకుల అరెస్టుతోపాటు పలు కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయని తెలిసిందే. ఎమర్జెన్సీ టైంలో ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా నిలబడ్డ ప్రముఖ రాజకీయ వేత్త జయప్రకాశ్ నారాయణ్ (జేపీ) పాత్రలో పాపులర్ బాలీవుడ్ దర్శకనిర్మాత అనుపమ్ ఖేర్ నటిస్తుండగా.. శ్రేయాస్ తల్పడే, భూమికా చావ్లా ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు.



## ఈసారి అంతకు మించి అంటున్న అడివి శేష్

చాలా కాలంగా అడివి శేష్ తన రాబోయే పాన్ ఇండియా చిత్రం 'గూడాచారి 2' కోసం వార్తల్లో నిలుస్తున్నాడు. ఈ చిత్రం 2018లో వచ్చిన స్పై థ్రిల్లర్ చిత్రం 'గూడాచారి' కి సీక్వెల్. ఈ చిత్రంలో అడివి శేష్ తొలిసారిగా మధు శాలిని జంటగా నటిస్తున్నారు. ఈ చిత్రంలో ప్రముఖ నటుడు ఇమ్రాన్ హష్మీ కూడా ప్రధాన పాత్రలో నటించనున్నారు. 'గూడాచారి 2' ని గ్రాండ్గా చేసేందుకు మేకర్స్100 కోట్ల భారీ బడ్జెట్తో చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రెండవ పార్ట్ బడ్జెట్ విషయానికి వస్తే రూ.100 కోట్లతో 'గూడాచారి 2' భారీ అంచనాలతో తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా మొదటి భాగాన్ని 6 కోట్ల రూపాయలతో నిర్మించారు. బాక్సాఫీస్ వద్ద రూ.25 కోట్లకు పైగా బిజినెస్ చేసింది. ప్రస్తుతం 'గూడాచారి 2' షూటింగ్ కొనసాగుతోంది. ఇక ఈ చిత్రాన్ని మరింత గ్రాండ్గా చేయడానికి మేకర్స్ స్విట్జర్లాండ్ , పోలాండ్, ఇటలీ ఇలా మరికొన్ని యూరోపియన్ దేశాలలో చిత్రీకరించడానికి ప్లాన్ చేస్తున్నారు. 'గూడాచారి 2' చిత్రానికి వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకత్వం వహించారు. టిజి విశ్వ ప్రసాద్, వివేక్ కూచిబొట్ల, అభిషేక్ అగర్వాల్ సినిమా నిర్మాతలు. ఈ సినిమా వచ్చే ఏడాది థియేటర్లలో విడుదల కానుంది. ప్రస్తుతానికి దీని విడుదల తేదీని వెల్లడించలేదు. ఈ సినిమా తెలుగుతో పాటు హిందీలో కూడా విడుదల కానుంది. దాని ప్రీక్వెల్ 'గూడాచారి' తెలుగులో మాత్రమే విడుదలైంది. ఆ తరువాత మేకర్స్ దానిని హిందీలో 'ఇంటిలిజెంట్ ఖిలాడీ'గా డబ్ చేసారు.

## ప్రభాస్ 'కల్కి 2' షూటింగ్ ప్రారంభమయ్యేది అప్పుడే.!

పాన్ ఇండియా నటుడు ప్రభాస్ కథానాయకుడిగా నాగ్అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన తాజా బ్లాక్ బస్టర్ 'కల్కి'. వైజయంతి మూవీస్ బ్యానర్లో వచ్చిన ఈ చిత్రం జూన్ 27న విడుదలై సూపర్హిట్ అందుకోవడమే కాకుండా.. ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.1300 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి రికార్డులను సృష్టించింది. ఇదిలావుంటే ఈ సినిమాకు సీక్వెల్ ఉందని నాగ్ అశ్విన్ ప్రకటించిన విషయం తెలిసిందే. సీక్వెల్ను అయితే ప్రకటించారు కానీ ఎప్పుడు మొదలుపెట్టనున్నారు అనేది మాత్రం వెల్లడించలేదు. అయితే తాజాగా కల్కి 2 సినిమా షూటింగ్కు సంబంధించి ఇంట్రెస్టింగ్ అప్డేట్ను పంచుకున్నారు నిర్మాతలు స్వప్నదత్, ప్రియాంకదత్లు. వీరిద్దరూ.. మాస్కో ఇంటర్నేషనల్ ఫిల్మ్ వీక్లో పాల్గొని అక్కడి మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ క్రమంలోనే మూవీ అప్డేట్ను పంచుకున్నారు. ఈ మూవీ షూటింగ్ అప్డేట్పై నిర్మాత ప్రియంకా దత్ మాట్లాడుతూ.. కల్కి 2 షూటింగ్ మరో ఆరు నెలల్లో మొదలుపెట్టనున్నట్లు చెప్పారు. ఒక్కసారి మూవీ షూటింగ్ స్టార్ట్ అయితే వరుస అప్డేట్లను ఇస్తాం అని తెలిపారు.



## మునుపెన్నడూ పోషించని పాత్రలో రష్మిక!



'నేషనల్ క్రష్' రష్మిక మందన్న వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఈ ఏడాది చివరలో 'పుష్ప 2'తో శ్రీవల్లిగా తెరపై సందడి చేయనున్నారు. ఇక 'యానిమల్' సినిమాతో బాలీవుడ్లో భారీ హిట్ అందుకున్న రష్మిక.. ఆయుష్మాన్ ఖురానాతో జతకట్టనున్నారు. ఆదిత్య సర్పోత్దార్ తెరకెక్కిస్తున్న 'వాంపైర్స్ ఆఫ్ విజయ్నగర్' సినిమా చిత్రీకరణ అక్టోబరులో మొదలుకానుంది. హారర్ కామెడీ నేపథ్యంలో రూపొందనున్న ఈ సినిమాలో రష్మిక మునుపెన్నడూ పోషించని పాత్ర చేస్తున్నారని తెలుస్తోంది. 'వాంపైర్స్ ఆఫ్ విజయ్నగర్ షూటింగ్ త్వరలో ఆరంభం కానుంది. రెండు కాలల మధ్య తీర్చిదిద్దుతున్న భిన్నమైన కథ ఇది. ఈ సినిమా తొలి షెడ్యూల్ కోసం విజయనగర సామ్రాజ్యాన్ని తలపించేలా ఓ భారీ సెట్ను చిత్ర బృందం సిద్ధం చేస్తోంది. ఈ సినిమాతో రష్మిక మందన్న సరికొత్త ప్రయాణం ప్రారంభం కానుంది. ఇందులో మునుపెన్నడూ పోషించని పాత్రలో ఆమె కనిపిస్తారు. రష్మిక పాత్ర ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తుంది. ఈ చిత్రం పెద్ద సక్సెస్ అవుతుంది' అని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.